PRGI NO TGTEL/26/A2948

జైత్ర
మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్

# జ్యోతి శ్వేత

JYYOTHI SHWETHA
దినపత్రిక

హైదరాబాద్, విజయవాడ ॥ సంపుటి:1 ॥ సంచిక: 105 ॥ బుధవారం ॥ 9-9-2026 ॥ పేజీలు: 8 ॥ వెల 3/-



09 సెప్టెంబర్ 2026 - బుధవారం శ్రీ పరాభవ నామ సంవత్సరం దక్షిణాయనం - వర్ష ఋతువు శ్రావణ మాసం - కృష్ణపక్షం సూర్యోదయం - ఉ. 6:06 సూర్యాస్తమయం - సా. 6:19 తిథి త్రయోదశి మ. 12:32 వరకు తరువాత చతుర్దశి సంస్కృత వారం సౌమ్య వాసరః నక్షత్రం ఆశ్లేష మ. 3:13 వరకు తరువాత మఖ యోగం శివ రా. 9:47 వరకు కరణం వనిజ మ. 12:32 వరకు విష్టి రా. 11:32 వరకు వర్జ్యం తె. 4:41 నుండి ఉ. 6:11 వరకు దుర్ముహూర్తం ఉ. 11:49 నుండి మ. 12:37 వరకు రాహుకాలం మ. 12:13 నుండి మ. 1:45 వరకు యమగండం ఉ. 7:38 నుండి ఉ. 9:10 వరకు గుళికాకాలం ఉ. 10:41 నుండి మ. 12:13 వరకు బ్రహ్మముహూర్తం తె. 4:30 నుండి తె. 5:18 వరకు అమృత ఘడియలు మ. 1:42 నుండి మ. 3:12 వరకు అభిజిత్ ముహూర్తం లేదు గమనిక: "o" అనగా మరుసటి రోజున



## కేసీఆర్ ఫామ్‌హౌస్ ముట్టడి

### ఎర్రవల్లి ఫామ్‌హౌస్ వద్ద ఉద్రిక్తత



మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ ఎర్రవల్లి ఫామ్‌హౌస్‌ను ముట్టడించేందుకు కాంగ్రెస్ కార్యకర్తలు, దళిత సంఘాల నాయకులు పెద్ద ఎత్తున తరలివచ్చిన నేపథ్యంలో మంగళవారం తీవ్ర ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. వెయ్యి మంది డప్పు కళాకారులతో నిరసన చేపట్టాలని కాంగ్రెస్ పార్టీ పిలుపునివ్వడంతో పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు.

2

### అసెంబ్లీ ఘటనపై హైకోర్టులో

## వాదనలు పూర్తి.. తీర్పు రిజర్వ్

మధ్యంతర ఉత్తర్వుల సవరణ కోరిన ప్రభుత్వ పిటిషన్‌పై విచారణ

ఇరుపక్షాల వాదనలు విన్న అనంతరం తీర్పు రిజర్వ్ చేసిన హైకోర్టు

మహిళా ఎమ్మెల్యేల పట్ల పోలీసుల వ్యవహారంపై ప్రశ్నలు

స్పీకర్ అధికారాలు, పోలీసుల చర్యలపై కోర్టులో విస్తృత చర్చ




హైదరాబాద్, సెప్టెంబర్ 8: తెలంగాణ అసెంబ్లీ వెలుపల ఇటీవల చోటుచేసుకున్న ఘటనల నేపథ్యంలో హైకోర్టు జారీ చేసిన మధ్యంతర ఉత్తర్వులను సవరించాలంటూ రాష్ట్ర ప్రభుత్వం దాఖలు చేసిన పిటిషన్‌పై మంగళవారం హైకోర్టులో విస్తృతంగా వాదనలు జరిగాయి. ప్రభుత్వం, బీఆర్ఎస్ తరఫు న్యాయవాదుల వాదనలను తరువాయి 2 వ పేజీలో...

### మోదీ ముంబయి పర్యటన వేళ

## హై అలర్ట్

వేదిక సమీపంలో ఇద్దరు వ్యక్తుల నిర్బంధం

నకిలీ పీఎంఓ ఐడీ కార్డు, తుపాకీ స్వాధీనం



**ముంబయి, సెప్టెంబర్ 8:** ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ముంబయి పర్యటన నేపథ్యంలో భద్రతా వ్యవస్థ అప్రమత్తమైంది. మోదీ పాల్గొననున్న కార్యక్రమం వేదిక సమీపంలో అనుమానాస్పదంగా సంచరిస్తున్న ఇద్దరు వ్యక్తులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి నకిలీ ప్రధానమంత్రి కార్యాలయం (పీఎంఓ) గుర్తింపు కార్డు, ఒక తుపాకీని స్వాధీనం చేసుకున్నట్లు అధికారులు తెలిపారు. ఈ ఘటనతో ముంబయిలో భద్రతా దళాలు మరింత అప్రమత్తమై, కార్యక్రమం జరిగే ప్రాంతంలో హై అలర్ట్ (మిగతా 2వ పేజీలో)

## వైసీపీకి షాక్

పార్టీకి రాజీనామా చేసిన జిల్లా అధ్యక్షుడు మజ్జి శ్రీనివాసరావు



2

ఉత్తరాంధ్ర వైసీపీలో కీలక పరిణామం

జిల్లా అధ్యక్ష పదవితో పాటు అన్ని బాధ్యతలకు రాజీనామా

### జగన్‌కు రాజీనామా లేఖ పంపిన చిన్న శ్రీను

ఉత్తరాంధ్ర రాజకీయాల్లో కీలక పరిణామం చోటుచేసుకుంది. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో సీనియర్ నాయకుడు, శాసనమండలి ప్రతిపక్ష నేత బొత్స సత్యనారాయణ మేనల్లుడు, విజయనగరం జిల్లా వైసీపీ అధ్యక్షుడు మజ్జి శ్రీనివాసరావు అలియాస్ చిన్న శ్రీను పార్టీకి రాజీనామా చేశారు. ఈ మేరకు ఆయన తన రాజీనామా లేఖను పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికి పంపించారు. ఈ నిర్ణయం వైసీపీ శ్రేణుల్లో తీవ్ర చర్చకు దారితీసింది. ముఖ్యంగా ఉత్తరాంధ్ర ప్రాంతంలో పార్టీకి ఇది పెద్ద ఎదురుదెబ్బగా రాజకీయ వర్గాలు అభిప్రాయపడుతున్నాయి.



### తాతా మధు, నవీన్ కుమార్ రెడ్డిల

## సస్పెన్షన్

సమావేశాల కాలం మొత్తం సస్పెండ్ చేసిన మండలి ఛైర్మన్

స్పీకర్‌పై అనుచిత వ్యాఖ్యల నేపథ్యంలో చర్యలు

తీర్మానం ప్రవేశపెట్టిన మంత్రి దామోదర రాజనర్సింహ

రాజ్యాంగబద్ధ పదవుల గౌరవం కాపాడాలని స్పష్టం

హైదరాబాద్, సెప్టెంబర్ 8: తెలంగాణ శాసనమండలిలో బీఆర్ఎస్ ఎమ్మెల్సీలు తాతా మధు, నవీన్ కుమార్ రెడ్డిలపై సస్పెన్షన్ వేటు పడింది. ప్రస్తుత సమావేశాల కాలం మొత్తం వారిని సస్పెండ్ చేస్తున్నట్లు మండలి ఛైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి ప్రకటించారు. అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్‌పై అనుచిత వ్యాఖ్యలు చేశారనే ఆరోపణల నేపథ్యంలో ఈ చర్యలు తీసుకున్నారు. ఈ అంశంపై అధికార కాంగ్రెస్ సభ్యులు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేస్తూ కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అసెంబ్లీ స్పీకర్‌పై అవమానకర వ్యాఖ్యలు చేయడం, శాసనసభ -2 వ పేజీలో...



2

## తాతా మధును బర్తరఫ్ చేయాలి

### మహిళా కాంగ్రెస్ డిమాండ్

స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్‌పై వ్యాఖ్యలను ఖండిస్తూ నిరసన

అంబేద్కర్ విగ్రహం వద్ద తాతా మధు దిష్టిబొమ్మ దహనం

బహిరంగ క్షమాపణ చెప్పాలని మహిళా కాంగ్రెస్ డిమాండ్

### ఇరాన్‌పై విజయం సాధిస్తే

## చమురు ధరలు కుప్పకూలుతాయి

ఇంధన ధరలపై ట్రంప్ సంచలన వ్యాఖ్యలు

గ్యాసోలిన్ ధర రెండు డాలర్ల కంటే దిగువకు వస్తుందని అంచనా

ట్రూత్ సోషల్‌లో పోస్టుతో రాజకీయ చర్చ

అమెరికాకు ఇరాన్ ఘాటు హెచ్చరిక



**వాషింగ్టన్, సెప్టెంబర్ 8:** ఇరాన్‌తో కొనసాగుతున్న ఉద్రిక్తతల నేపథ్యంలో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చేసిన తాజా వ్యాఖ్యలు ప్రపంచవ్యాప్తంగా చర్చకు దారితీశాయి. ఇరాన్‌తో జరిగే యుద్ధంలో అమెరికా విజయం సాధిస్తే అంతర్జాతీయ మార్కెట్లో చమురు ధరలు భారీగా పడిపోతాయని ఆయన పేర్కొన్నారు. ఇంధన ధరల తగ్గుదల అమెరికా ఆర్థిక వ్యవస్థకు కొత్త ఊపును తీసుకువస్తుందని ఆయన అభిప్రాయపడ్డారు. ట్రంప్ చేసిన ఈ వ్యాఖ్యలు ప్రపంచ ఇంధన మార్కెట్లతో పాటు రాజకీయ వర్గాల్లోనూ ఆసక్తిని రేకెత్తిస్తున్నాయి. (మిగతా 2వ పేజీలో)

### ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలపై

## చర్యలు తీసుకోవాలి

గవర్నర్‌ను కలిసి వినతిపత్రం సమర్పించిన ఎన్. రామచంద్రరావు

40 లక్షల మంది విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన

2



# నేటి రాశి ఫలాలు

మేషం: వ్యాపారమున సొంత నిర్ణయాలతో లాభాలు అందుకుంటారు. చేపట్టిన పనులలో యత్నకార్యసిద్ధి కలుగుతుంది. నిరుద్యోగులకు నూతన ఉద్యోగప్రాప్తి కలుగుతుంది. ఉద్యోగమున అధికారుల అనుగ్రహం పొందుతారు.చిన్ననాటి మిత్రులతో శుభకార్యాలలో పాల్గొంటారు. బంధువులతో విభేదాలు తొలగుతాయి.

వృషభం: ఆధ్యాత్మిక చింతన పెరుగుతుంది. ఆరోగ్య విషయంలో జాగ్రత్త అవసరం. మిత్రులతో వివాదాలు మానసికంగా చికాకుగా కలిగిస్తాయి. దూరప్రయాణాలు వాయిదా వెయ్యడం మంచిది. వ్యాపార, ఉద్యోగాలలో కొంత అసంతృప్తి తప్పదు. ముఖ్యమైన వ్యవహారాలలో కష్టించినా ఫలితం కనిపించదు. సోదరులతో స్థిరాస్తి వివాదాలు ఉంటాయి.

మిధునం: వృత్తి వ్యాపారాలలో ఆకస్మికంగా కొన్ని నిర్ణయాలు మార్చుకుంటారు. బంధుమిత్రులతో స్వల్ప వివాదాలు ఉంటాయి. పుణ్యక్షేత్రాలు సందర్శిస్తారు. ఉద్యోగమున పని ఒత్తిడి అధికమవుతుంది. చేపట్టిన పనులలో కష్టానికి తగిన ఫలితం లభించదు. కుటుంబ వ్యవహారాల్లో తొందరపాటు పడకూడదు.

కర్కాటకం: స్థిరాస్తి క్రయ విక్రయాలు లాభసాటిగా సాగుతాయి. ప్రముఖుల నుంచి కీలక సమాచారం అందుతుంది. వ్యాపారమున అంచనాలు అందుకుంటారు. ఉద్యోగాలలో సమస్యలు తీరుతాయి. చిన్ననాటి మిత్రులతో విందు వినోదాది కార్యక్రమాల్లో పాల్గొంటారు. కొన్ని పనులు సకాలంలో పూర్తి చేస్తారు.

సింహం: ఉద్యోగాలలో పదోన్నతులు పెరుగుతాయి. చేపట్టిన వ్యవహారాలలో విజయం సాధిస్తారు. బంధువుల నుంచి అరుదైన ఆహ్వానాలు అందుతాయి. వ్యాపారాలు విస్తరిస్తారు. నిరుద్యోగ ప్రయత్నాలు సానుకూలమవుతాయి. భాగస్వామితో శుభకార్యాలకు హాజరవుతారు. ఆర్థిక లావాదేవీలు ఆశాజనకంగా సాగుతాయి.

కన్య: ఉద్యోగమున ఉన్నతాధికారులతో అప్రమత్తంగా వ్యవహరించాలి. ఇంటా బయట ఆశ్చర్యకరమైన విషయాలు తెలుస్తాయి. ఆరోగ్య విషయంలో జాగ్రత్త అవసరం. ఆకస్మిక ప్రయాణ సూచనలు ఉన్నవి. విద్యార్థుల శ్రమ ఫలించదు. చేపట్టిన పనులు వాయిదా వేస్తారు. బంధువర్గంతో వివాదాలు తప్పవు.

తుల: ముఖ్యమైన వ్యవహారాలలో ఆలోచనలు స్థిరంగా ఉండవు. చేపట్టిన పనుల్లో అవాంతరాలు తప్పవు. బంధువులతో అకారణ వివాదాలు కలుగుతాయి. వ్యాపార, ఉద్యోగాలలో ఊహించని సమస్యలు ఉంటాయి. దూరప్రయాణాలు వాయిదా పడతాయి. కుటుంబ సభ్యులతో ఆలయాలు సందర్శిస్తారు.

వృశ్చికం: పుణ్యక్షేత్రాలు సందర్శిస్తారు. వ్యాపారాలు సాఫీగా సాగుతాయి. నూతన కార్యక్రమాలకు శ్రీకారం చుడతారు. ఆత్మీయులతో సఖ్యతగా వ్యవహరిస్తారు. ఉద్యోగాలలో పదోన్నతులు పెరుగుతాయి. విందు వినోద కార్యక్రమాలకు ఆహ్వానాలు అందుతాయి. స్థిరాస్తి కొనుగోలు ప్రయత్నాలు ఫలిస్తాయి.

ధనస్సు: సోదరులతో స్థిరాస్తి వివాదాలలో నూతన ఒప్పందాలు చేసుకుంటారు. సన్నిహితులతో మాట పట్టింపులు ఉంటాయి. దైవ సేవా కార్యక్రమాలలో పాల్గొంటారు. వ్యాపారాలు అంతంత మాత్రంగా సాగుతాయి. ఉద్యోగాలలో గందరగోళ పరిస్థితులు ఉంటాయి. ఆర్థిక పరిస్థితి కొంత నిరాశ పరుస్తుంది. ఆకస్మిక ప్రయాణ సూచనలు ఉన్నవి.

మకరం: విలువైన వస్తు వాహన లాభాలు పొందుతారు. ప్రయాణాలలో నూతన వ్యక్తులతో పరిచయాలు కలుగుతాయి. ఉద్యోగాలలో మీ ప్రతిభ వెలుగులోకి వస్తుంది. నిరుద్యోగులకు నూతన అవకాశాలు అందుతాయి. సంఘంలో గౌరవ మర్యాదలకు లోటు ఉండదు. స్థిరాస్తి క్రయవిక్రయాలలో నూతన లాభాలను అందుకుంటారు.

కుంభం: వ్యాపార ఉద్యోగాలలో ఊహించని సమస్యలు తప్పవు. చేపట్టిన వ్యవహారాలు మందకొడిగా సాగుతాయి. ఆర్థిక ఇబ్బందులు చికాకు పరుస్తాయి. దైవ కార్యక్రమాల్లో పాల్గొంటారు. ఆర్థిక వ్యవహారాలలో ఆలోచనలు స్థిరంగా ఉండవు. కుటుంబ సభ్యులతో విభేదాలు తప్పవు. అనారోగ్య సమస్యలు బాధిస్తాయి.

మీనం: వ్యాపారాలలో నూతన పెట్టుబడులు అందుతాయి. చేపట్టిన వ్యవహారాలలో పురోగతి సాధిస్తారు. బంధు మిత్రుల నుండి శుభవార్తలు అందుతాయి. ఉద్యోగాలలో అధికారుల సహాయ సహకారాలు అందుతాయి. ఇంటా బయట అనుకూల వాతావరణం ఉంటుంది. కొత్త వ్యక్తుల పరిచయాలు ఉత్సాహాన్నిస్తాయి.



# కేసీఆర్ ఫామ్‌హౌస్ ముట్టడి!

**ఎర్రవల్లి, సెప్టెంబర్ 8:**

ఫామ్‌హౌస్ వైపు వెళ్తున్న నిరసనకారులను మార్గమధ్యంలోనే అడ్డుకోవడంతో అక్కడ ఉద్రిక్తత నెలకొంది. దళితులను అవమానించారనే ఆరోపణలపై బీఆర్ఎస్‌కు వ్యతిరేకంగా కాంగ్రెస్ పార్టీ ఈ నిరసన కార్యక్రమాన్ని చేపట్టింది. గజ్వేల్ నియోజకవర్గంతో పాటు రాష్ట్రంలోని పలు ప్రాంతాల నుంచి కాంగ్రెస్ కార్యకర్తలు, దళిత సంఘాల నాయకులు ఎర్రవల్లికి చేరుకున్నారు. వరదరాజాపూర్ మీదుగా ఫామ్‌హౌస్ సమీపానికి చేరుకున్న వారిని పోలీసులు నిలువరించారు. పోలీసుల అడ్డుకోవడంతో నిరసనకారులు డప్పుల మోతతో ఆందోళన చేపట్టారు. బారికేడ్లను తొలగించి ముందుకు వెళ్లేందుకు ప్రయత్నించడంతో పోలీసులు వారిని వెనక్కి నెట్టారు. ఈ క్రమంలో పోలీసులు, నిరసనకారుల మధ్య తోపులాట చోటుచేసుకుంది. పరిస్థితిని అదుపులోకి తీసుకురావడానికి పోలీసులు చర్యలు చేపట్టగా కొందరు పోలీసు సిబ్బందికి స్వల్ప గాయాలు అయినట్లు సమాచారం. ఫామ్‌హౌస్ సమీపంలో సుమారు రెండున్నర గంటలపాటు ఉద్రిక్త పరిస్థితులు కొనసాగాయి. ఈ సందర్భంగా గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే నర్సారెడ్డి సహా పలువురు కాంగ్రెస్ నాయకులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఫామ్‌హౌస్ పరిసరాల్లో భారీ సంఖ్యలో భద్రతా సిబ్బందిని మోహరించారు. ఇదే సమయంలో అసెంబ్లీ నుంచి ఎర్రవల్లికి బయలుదేరిన బీఆర్ఎస్ నేతలు కేటీఆర్, హరీశ్‌రావు సహా పలువురు ఎమ్మెల్యేలను పోలీసులు హకీంపేట వద్ద అడ్డుకుని అదుపులోకి తీసుకున్నారు. పోలీసుల తీరుపై బీఆర్ఎస్ నేతలు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. అనంతరం కేటీఆర్‌ను బోయిన్‌పల్లి పోలీస్ స్టేషన్‌కు, హరీశ్‌రావును జవహర్‌నగర్ పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఈ వ్యవహారంపై అధికార, ప్రతిపక్ష పార్టీల మధ్య తీవ్ర వాగ్వాదం కొనసాగుతోంది. తాతా మధుపై చర్యలు తీసుకోవాలని కాంగ్రెస్, బీజేపీ, ఎంఐఎం, సీపీఐ పార్టీలు డిమాండ్ చేయగా, బీఆర్ఎస్ మాత్రం తమ పార్టీపై రాజకీయ కక్ష సాధింపే జరుగుతోందని ఆరోపిస్తోంది.



# అసెంబ్లీ ఘటనపై హైకోర్టులో..

(మొదటి పేజీ తరువాయి)

వచ్చాయి. ప్రభుత్వం తరఫున అడ్వకేట్ జనరల్ సుదర్శన్ రెడ్డి వాదనలు వినిపిస్తూ, శాసనసభను సజావుగా నిర్వహించే బాధ్యత స్పీకర్‌పై ఉంటుందని పేర్కొన్నారు. ప్లకార్డులు, నినాదాలు, నల్లటి దుస్తులతో సభలోకి ప్రవేశించడాన్ని నిబంధనలు అనుమతించవని తెలిపారు. స్పీకర్ ఆదేశాల మేరకు చీఫ్ మార్షల్ పోలీసులకు సూచనలు చేశారని, ఆ సూచనల ప్రకారమే పోలీసులు విధులు నిర్వర్తించారని కోర్టుకు వివరించారు. అసెంబ్లీ పరిసరాల్లో ర్యాలీలు, నిరసనలపై హైదరాబాద్ పోలీస్ కమిషనర్ ఆదేశాలు అమల్లో ఉన్నాయని కూడా తెలిపారు. విధి నిర్వహణలో భాగంగా పోలీసులు ఎమ్మెల్యేలను అడ్డుకున్నారని ప్రభుత్వం తరఫు న్యాయవాది వాదించారు. నల్లటి టీషర్టులు ధరించి అసెంబ్లీలోకి వెళ్లేందుకు ప్రయత్నించడం వల్ల శాంతిభద్రతల సమస్యలు తలెత్తే అవకాశం ఉందని పేర్కొన్నారు. అంతేకాకుండా విధుల్లో ఉన్న మహిళా పోలీసులతో కొందరు బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు అనుచితంగా ప్రవర్తించారని, పోలీసు అధికారులను దూషించారని కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. ఈ నేపథ్యంలో పోలీసులపై చర్యలు తీసుకోవాలంటూ గతంలో ఇచ్చిన ఉత్తర్వులను సవరించాలని ప్రభుత్వ తరఫు న్యాయవాది కోరారు. అయితే ప్రభుత్వ వాదనలపై స్పందించిన హైకోర్టు పలు కీలక ప్రశ్నలు లేవనెత్తింది. శాసనసభ నియమావళిని సభ్యులు ఉల్లంఘిస్తే చర్యలు తీసుకునే అధికారం స్పీకర్‌కు ఉంటుందని, అలాంటప్పుడు పోలీసులు ఎందుకు జోక్యం చేసుకున్నారని ప్రశ్నించింది. మహిళా ఎమ్మెల్యేల పట్ల పోలీసులు అనుచితంగా ప్రవర్తించారన్న ఆరోపణలపై కూడా వివరణ కోరింది. దీనికి సమాధానంగా మహిళా ఎమ్మెల్యేలను సభలోకి వెళ్లకుండా అడ్డుకోలేదని, ఎవరితోనూ దురుసుగా ప్రవర్తించలేదని ప్రభుత్వం తరఫు న్యాయవాది స్పష్టం చేశారు. బీఆర్ఎస్ తరఫు న్యాయవాది వాదిస్తూ, అసెంబ్లీలోకి ప్రవేశించకుండా సభ్యులను అడ్డుకునే అధికారం పోలీసులకు లేదన్నారు. చీఫ్ మార్షల్‌కు స్పీకర్ నుంచి లిఖితపూర్వక ఆదేశాలు ఉన్నట్లు ప్రభుత్వం ఎలాంటి ఆధారాలు సమర్పించలేదని పేర్కొన్నారు. ఒకవేళ సభ్యులు నిబంధనలు ఉల్లంఘించినా వారిపై చర్యలు తీసుకునే బాధ్యత స్పీకర్‌దేనని, పోలీసులది కాదని వాదించారు. సభ్యులను అసెంబ్లీకి అనుమతించకుండా అడ్డుకుని, అనంతరం తెలంగాణ భవన్‌కు తరలించడం వెనుక కారణాలను కూడా ప్రశ్నించారు. ఇరువైపులా వాదనలు ముగియడంతో హైకోర్టు తీర్పును రిజర్వ్ చేసింది. అసెంబ్లీ ఆవరణలో జరిగిన ఘటనలకు సంబంధించి పోలీసుల పాత్ర, స్పీకర్ అధికారాలు, శాసనసభ సభ్యుల హక్కులు వంటి అంశాలపై ఈ తీర్పు కీలకంగా మారనుంది. హైకోర్టు నిర్ణయం వెలువడిన తర్వాత ఈ వివాదానికి సంబంధించి తదుపరి రాజకీయ, న్యాయపరమైన పరిణామాలు చోటుచేసుకునే అవకాశం ఉందని పరిశీలకులు భావిస్తున్నారు.

# ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలపై చర్యలు తీసుకోవాలి

## గవర్నర్‌ను కలిసి వినతిపత్రం సమర్పించిన ఎన్.రామచంద్రరావు

**40 లక్షల మంది విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన**

**రూ.15 వేల కోట్ల బకాయిలు విడుదల చేయాలని డిమాండ్**

**విద్యా వ్యవస్థ సంక్షోభంలో ఉందని ఆరోపణ**

**హైదరాబాద్, సెప్టెంబర్ 8:**

ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిల విడుదలకు తక్షణ చర్యలు తీసుకోవాలని కోరుతూ బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రామచంద్ర రావు గవర్నర్‌ను కలిసి వినతిపత్రం సమర్పించారు. దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిల కారణంగా లక్షలాది మంది విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆయన గవర్నర్ దృష్టికి తీసుకెళ్లారు. ఈ అంశంపై రాష్ట్ర ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలని కోరారు. రాష్ట్రంలో సుమారు 40 లక్షల మంది విద్యార్థులు ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిల కోసం ఎదురుచూస్తున్నారని రామచంద్రరావు తెలిపారు. ఈ బకాయిలు విడుదల కాకపోవడంతో విద్యార్థుల విద్యాభ్యాసంపై ప్రతికూల ప్రభావం పడుతోందని పేర్కొన్నారు. విద్యార్థుల భవిష్యత్తు దృష్ట్యా ప్రభుత్వం తక్షణమే స్పందించాలని డిమాండ్ చేశారు. సుమారు రూ.15 వేల కోట్ల మేర ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు పెండింగ్‌లో ఉన్నాయని ఆయన ఆరోపించారు. ఈ కారణంగా అనేక విద్యాసంస్థలు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని, ఉపాధ్యాయులకు పూర్తి స్థాయిలో వేతనాలు చెల్లించలేని పరిస్థితి నెలకొందని పేర్కొన్నారు. కొన్ని కళాశాలలు సగం జీతాలతోనే సిబ్బందిని కొనసాగిస్తున్నాయని అన్నారు. విద్యార్థుల సమస్యలను ప్రభుత్వం పట్టించుకోవడం లేదని రామచంద్రరావు విమర్శించారు. ఈ అంశంపై బీజేపీ ఆందోళన వ్యక్తం చేసినప్పుడు ప్రభుత్వం స్పందించకుండా నిరసనలను అణచివేయడానికి ప్రయత్నిస్తోందని ఆరోపించారు. ప్రజాస్వామ్యబద్ధంగా సమస్యలను ప్రస్తావించిన వారిపై చర్యలు తీసుకోవడం సరికాదని పేర్కొన్నారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ సమస్య పరిష్కారం కాకపోతే విద్యా వ్యవస్థ మరింత సంక్షోభంలోకి వెళ్లే ప్రమాదం ఉందని ఆయన అభిప్రాయపడ్డారు. విద్యార్థులు, కళాశాలలు, ఉపాధ్యాయుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం వెంటనే నిధులు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. విద్యను కాపాడేందుకు తక్షణ చర్యలు అవసరమని అన్నారు. గవర్నర్‌కు సమర్పించిన వినతిపత్రంలో విద్యార్థుల సమస్యలను వివరించినట్లు బీజేపీ నేతలు తెలిపారు. రాష్ట్రంలోని విద్యా రంగ పరిస్థితులపై గవర్నర్ జోక్యం చేసుకుని ప్రభుత్వాన్ని స్పందించేలా చూడాలని కోరినట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు, పార్టీ ప్రతినిధులు పాల్గొన్నారు.

# మోదీ ముంబయి పర్యటన వేళ హై అలర్ట్

(మొదటి పేజీ తరువాయి)

ప్రకటించాయి. సోమవారం రాత్రి భద్రతా దళాలు నిర్వహిస్తున్న ప్రోటోకాల్ తనిఖీల సమయంలో ఈ విషయం వెలుగులోకి వచ్చినట్లు సమాచారం. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ మంగళవారం సాయంత్రం బాంద్రా-కుర్లా కాంప్లెక్స్ (బీకేసీ)లో నిర్వహించే కార్యక్ర మంలో పాల్గొనాల్సి ఉంది. ఈ నేపథ్యంలో నీతా ముఖేశ్ అంబానీ కల్చరల్ సెంటర్ వద్ద భద్రతా తనిఖీలు కట్టుదిట్టం చేశారు. ఈ సమయంలో ప్రధానమంత్రి కార్యాలయానికి చెందిన అధికారులమని చెప్పుకుంటూ ఇద్దరు వ్యక్తులు కార్యక్రమ ప్రాంగణంలోకి ప్రవేశించేందుకు ప్రయత్నించినట్లు అధికారులు గుర్తించారు. వారి ప్రవర్తనపై అనుమానం రావడంతో భద్రతా సిబ్బంది వారిని నిలిపివేసి విచారణ చేపట్టారు. భద్రతా సిబ్బంది వారి వద్ద ఉన్న గుర్తింపు కార్డులను పరిశీలించగా అవి నకిలీవని తేలినట్లు అధికారులు వెల్లడించారు. అనంతరం వారిని అదుపులోకి తీసుకుని ముంబయి పోలీసులకు అప్పగించారు. పోలీసుల ప్రాథమిక విచారణలో అనుమాని తుల్లో ఒకరిని రోహన్ పరేఖ్‌గా గుర్తించినట్లు తెలుస్తోంది. ఈ వ్యక్తులు కార్యక్రమ ప్రాంగణానికి ఎందుకు వచ్చారు, వారి ఉద్దేశం ఏమిటి, స్వాధీనం చేసుకున్న ఆయుధం నేపథ్యం ఏమిటి అనే అంశాలపై పోలీసులు దర్యాప్తు చేపట్టారు. ఇదిలా ఉండగా, బీకేసీ ప్రాంతంలోని జియో వరల్డ్ ప్లాజా షాపింగ్ సముదాయంలో జరిగిన మరో ఘటన కూడా చర్చనీయాంశంగా మారింది. తుపాకీతో మాల్‌లోకి ప్రవేశించేందుకు ప్రయత్నించిన ముగ్గురు వ్యక్తులను పోలీసులు అరెస్టు చేసినట్లు వెల్లడించారు.

# చమురు ధరలు కుప్పకూలుతాయి

(మొదటి పేజీ తరువాయి)

తన సోషల్ మీడియా వేదిక 'ట్రూత్ సోషల్'లో చేసిన పోస్టులో ట్రంప్ పలు కీలక వ్యాఖ్యలు చేశారు. ఇరాన్‌పై విజయం సాధించిన తర్వాత చమురు ధరలు వేగంగా తగ్గుతాయని, ప్రస్తుతం ఉన్న స్థాయిల నుంచి గ్యాసోలిన్ ధర గ్యాలన్‌కు మూడు డాలర్లకు చేరుకుని, ఆ తర్వాత రెండు డాలర్ల కంటే దిగువకు పడిపోతుందని ఆయన పేర్కొన్నారు. ఈ మార్పులు చాలా వేగంగా చోటుచేసుకుంటాయని చెబుతూ 'మేక్ అమెరికా గ్రేట్ అగైన్' నినాదాన్ని మరోసారి ప్రస్తావించారు.

# తాతా మధు, నవీన్ కుమార్ రెడ్డిల సస్పెన్షన్

(మొదటి పేజీ తరువాయి)

ప్రాంగణంలో బీఆర్ఎస్ ప్రజాప్రతినిధుల ప్రవ నపై ప్రభుత్వం తీవ్రంగా స్పందించింది. ఈ నేపథ్యంలో ఎమ్మెల్సీలు తాతా మధు, నవీన్ కుమార్ రెడ్డిలపై చర్యలు తీసుకోవాలని కోరుతూ మంత్రి దామోదర రాజనర్సింహ శాసనసభలో ప్రత్యేక తీర్మానాన్ని ప్రవేశపెట్టారు. రాజ్యాంగబద్ధమైన పదవుల గౌరవాన్ని కాపాడడం ప్రతి ప్రజాప్రతినిధి బాధ్యత అని ఆయన స్పష్టం చేశారు. తీర్మానంపై మాట్లాడిన మంత్రి దామోదర రాజనర్సింహ, ఎస్సీల చరిత్ర జాతీయ ఆత్మగౌరవంతో ముడిపడి ఉందని పేర్కొన్నారు. దానిని ఒక వర్గానికి మాత్రమే పరిమితం చేయడం సరికాదన్నారు. ప్రజాస్వామ్యంలో గెలుపోటములు సహజమని, అయితే రాజ్యాంగ వ్యవస్థలు, ప్రజాస్వా మ్య సంస్థల గౌరవాన్ని కాపాడాల్సిన బాధ్యత అందరిపైనా ఉంటుందని చెప్పారు.

# తాతా మధును వెంటనే బర్తరఫ్ చేయాలి

**బహిరంగ క్షమాపణ చెప్పాలని మహిళా కాంగ్రెస్ డిమాండ్**

హైదరాబాద్, సెప్టెంబర్ 8: తెలంగాణ అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్‌పై బీఆర్ఎస్ ఎమ్మెల్సీ తాతా మధు చేసినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న వ్యాఖ్యలను ఖండిస్తూ తెలంగాణ ప్రదేశ్ మహిళా కాంగ్రెస్ ఆధ్వర్యంలో మంగళవారం నిరసన కార్యక్రమం నిర్వహించారు. లోయర్ ట్యాంక్‌బండ్‌లోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహం వద్ద జరిగిన ఈ కార్యక్రమానికి తెలంగాణ ప్రదేశ్ మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణ నాయకత్వం వహించారు. ఖైరతాబాద్, సికింద్రాబాద్, మేడ్చల్ జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాళ్ల ఆధ్వర్యంలో జరిగిన ఈ నిరసనలో పెద్ద సంఖ్యలో మహిళా నాయకురాళ్లు, కార్యకర్తలు పాల్గొన్నారు. స్పీకర్ పదవికి గౌరవం కల్పించాలని, ప్రజాస్వామ్య వ్యవస్థలో రాజ్యాంగబద్ధమైన పదవులపై అనుచిత వ్యాఖ్యలు చేయడం సరికాదని వారు పేర్కొన్నారు. ఈ సందర్భంగా మహిళా కాంగ్రెస్ నేతలు తాతా మధు దిష్టి బొమ్మను దహనం చేస్తూ నిరసన వ్యక్తం చేశారు. శాసనసభ స్పీకర్‌ను ఉద్దేశించి అవమానకర వ్యాఖ్యలు చేయడం ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధమని అన్నారు.

# వైసీపీకి షాక్

పార్టీలో ఎన్నో సంవత్సరాలుగా కీలక పాత్ర పోషించిన ఆయన ఈ నిర్ణయం తీసుకోవడం వైసీపీ వర్గాల్లో ఆశ్చర్యాన్ని కలిగించింది. పార్టీ కార్యక్రమాలు, సంస్థాగత వ్యవహారాల్లో చురుకుగా వ్యవహరించిన నేతగా ఆయనకు గుర్తింపు ఉంది. ప్రస్తుతం విజయనగరం జిల్లా పరిషత్ ఛైర్మన్‌గా కొనసాగుతున్న చిన్న శ్రీను, జిల్లాలో బలమైన రాజకీయ ప్రభావం కలిగిన నాయకుడిగా గుర్తింపు పొందారు. బొత్స కుటుంబానికి అత్యంత సన్నిహితుడిగా, వారి రాజకీయ కార్యకలాపాల్లో కీలకంగా వ్యవహరించిన ఆయన అకస్మాత్తుగా పార్టీని వీడటం వెనుక కారణాలపై విస్తృతంగా చర్చ జరుగుతోంది. అయితే ఇప్పటివరకు ఆయన తన నిర్ణయానికి సంబంధించిన పూర్తి వివరాలను వెల్లడించలేదు. విజయనగరం జిల్లాలో పార్టీ నిర్మాణం, స్థానిక ఎన్నికల వ్యూహాలు, నాయకత్వ సమన్వయంలో చిన్న శ్రీను కీలక పాత్ర పోషించారు. జిల్లా అధ్యక్షుడిగా ఆయన పార్టీని బలోపేతం చేసేందుకు అనేక కార్యక్రమాలు చేపట్టారు. అలాంటి సమయంలో ఆయన రాజీనామా చేయడం వల్ల జిల్లా స్థాయిలో పార్టీ కార్యకలాపాలపై ప్రభావం పడే అవకాశం ఉందని రాజకీయ పరిశీలకులు భావిస్తున్నారు.

# శ్వేత సంపాదకీయం

**బుధవారం 9-9-2026**

## పెరుగుతున్న సైబర్ మోసాలు

నేటి కాలంలో సైబర్ మోసాలు విపరీతంగా పెరుగుతున్నాయి. ఎదో ఒకచోట ఎదో ఒక రకంగా వినియోగదారులు, ప్రజలు సైబర్ దాడులకు గురై మోసపోతూనే ఉన్నారు. తాజాగా.. మెటా సంస్థకు చెందిన ఇన్‌స్టాగ్రామ్‌లో కొందరు మోసగాళ్లు ఇతరుల పోస్టులపై కావాలనే తప్పుడు కాపీరైట్ ఫిర్యాదులు చేస్తున్నారు. ఆ తర్వాత వాటిని వెనక్కి తీసుకోవాలంటే డబ్బులు ఇవ్వాలంటూ బెదిరిస్తున్నారు. పదేపదే ఇలాంటి ఫిర్యాదులు వస్తే తమ ఖాతాలు శాశ్వతంగా బ్లాక్ అవుతాయనే భయంతో యూజర్లు వాళ్లు అడిగినంత ఇచ్చుకుంటున్నారు. 15 లక్షల మంది ఫాలోవర్లు ఉన్న ఒక ఇన్‌స్టాగ్రామ్ యూజర్, తన ఖాతాను కాపాడుకోవడానికి ఒక మోసగాడికి 50 డాలర్లు (రూ. 4700) చెల్లించినట్లు బీబీసీకి తెలిపారు. మెటా అప్పీల్ ప్రక్రియకు వారాల సమయం పడుతుందని, ఆ ప్రాసెస్‌లో వెళ్తే తనకు గతంలో వేల రూపాయల ఆదాయం పోయిందని ఆయన అన్నారు. “ఈ పరిస్థితి బాధితులకు ఎంత ఇబ్బందిగా ఉంటుందో మాకు అర్థమవుతోంది, ఇలాంటివి జరగకుండా నిరోధించేలానే మా వ్యవస్థలను తీర్చిదిద్దాం” అని మెటా ప్రతినిధి వివరించారు. “మా విచారణ తర్వాత, సదరు కంటెంట్‌ను మళ్లీ యథాస్థితికి తెచ్చాం. భవిష్యత్తులో ఇలాంటి దాడులు జరగకుండా ఖాతాలకు అదనపు భద్రతను కూడా కల్పించాం” అని తెలిపారు. కానీ, ఏది నిజమైన ఫిర్యాదో, ఏది నకిలీదో గుర్తించడంలో మెటా పనితీరు పేలవంగా ఉందని క్రియేటర్లు అంటున్నారు. నెలవారీ ఫీజు చెల్లించే క్రియేటర్ల అప్పీళ్లకు తప్ప, సాధారణ యూజర్ల ఫిర్యాదులకు సంస్థ త్వరగా స్పందించడం లేదని వారు బీబీసీతో చెప్పారు. ‘లాస్ట్ ఇన్ టైమ్ హిస్టరీ’ అనే ఇన్‌స్టాగ్రామ్ పేజీ పాత చారిత్రక చిత్రాలను పోస్ట్ చేస్తూ ఉంటుంది. దీనికి 15 లక్షలకు పైగా ఫాలోవర్లు ఉన్నారు. దీనిని నడిపే ఓలి ( పూర్తి పేరు చెప్పడానికి ఇష్టపడలేదు), తాను పబ్లిక్ డొమైన్‌లో అందుబాటులో ఉన్న చిత్రాలను లేదా హక్కుదారుల అనుమతి ఉన్నవాటినే పోస్ట్ చేస్తున్నట్లు బీబీసీకి చెప్పారు. అయినా సరే, ఈ ఏడాదిలో అతనికి ఇప్పటివరకు డజన్ల కొద్దీ “స్పష్టంగా నకిలీ” కాపీరైట్ ఫిర్యాదులు వచ్చాయి. ఫిర్యాదులు వచ్చిన వెంటనే మెటా వాటి వాస్తవాన్ని చెక్ చేయదు.

కాబట్టి ఎవరి ఖాతాపైనైనా ఇలా వరుసగా ఫిర్యాదులు వస్తే వాళ్ల అకౌంట్ తాత్కాలికంగా ఆగిపోతుంది. ఒకే ఈమెయిల్ ఐడీ నుంచి ఒకేసారి తన పలు పోస్టులపై కాపీరైట్ స్ట్రైక్స్ వస్తున్నాయని ఓలి చెప్పారు. ఆ తర్వాత ఆ ఫిర్యాదు చేసిన వ్యక్తి, టెలిగ్రామ్ లాంటి ప్రైవేట్ మెసేజింగ్ యాప్‌లోకి రమ్మని మెసేజ్ చేస్తాడు. “వాళ్లు కొంత డబ్బు డిమాండ్ చేస్తారు” అని ఓలి తెలిపారు. ఆ ఫిర్యాదును వెనక్కి తీసుకోవాలంటే సాధారణంగా కొన్ని వందల డాలర్లు అడుగుతారని చెప్పారు. డబ్బు అడగడం లేదా భవిష్యత్తులో మరిన్ని కాపీరైట్ ఫిర్యాదులు చేస్తామని బెదిరించడం లాంటి మెసేజ్‌లను బీబీసీ కూడా పరిశీలించింది. ఇన్‌స్టాగ్రామ్ తాత్కాలికంగా ఆపేసిన తన అకౌంట్‌ను తిరిగి తెచ్చుకోవడానికి ఓలి చివరికి ఒక మోసగాడికి క్రిప్టోకరెన్సీ రూపంలో 50 డాలర్లు ఇవ్వడానికి ఒప్పుకున్నారు. ఇలా డబ్బులు ఇస్తే నేరగాళ్లను ప్రోత్సహించినట్లే అవుతుందని, కాబట్టి డబ్బులు ఇవ్వొద్దని పోలీసులు బాధితులకు సూచిస్తున్నారు. మెటాను సంప్రదించి ఖాతాను వెనక్కి తెచ్చుకోవాలంటే వారాల కొద్దీ సమయం పడుతుంది కాబట్టి, వేగంగా పనైపోతుందనే ఉద్దేశంతోనే తాను “చివరి ప్రయత్నంగా” డబ్బు కట్టానని ఓలి అన్నారు. కానీ డబ్బు ఇచ్చిన వెంటనే మళ్లీ అతనికి కాపీరైట్ స్ట్రైక్స్ పడ్డాయి. “అదే అత్యంత బాధాకరమైన విషయం” అన్నారు ఓలి. “మనల్ని అంతలా టార్చర్ చేసినవాళ్లకే డబ్బులు సమర్పించుకోవడం, ఆ వెంటనే మళ్లీ వాళ్లు అదే పని చేయడం మనకు ఎంతో నరకంగా అనిపిస్తుంది” అన్నారు. కాపీరైట్ దావాలు ఎక్కువగా రావడంతో ఓలి ఖాతాకు మానిటైజేషన్ ఆగిపోయింది. అంటే, అతని పోస్టులు ఎంత వైరల్ అయినా ఇన్‌స్టాగ్రామ్ నుంచి అతనికి నయాపైసా రాదు.

“ఇది వేధింపులా కాదా అని తెలుసుకోవడానికి లేదా అసలు ఏం జరుగుతుందో కనిపెట్టడానికి (మెటా నుంచి) వ్యవస్థలో కనీస విచారణ కూడా జరగడం లేదు” అని ఓలి అన్నారు. చాలా మంది ఇన్‌స్టాగ్రామ్ యూజర్లు కూడా ఇలాంటి అనుభవాలనే పంచుకున్నారు. “క్రియేటర్ల కోసమే తాము ఉన్నామని మెటా పైకి చెబుతున్నప్పటికీ, ఈ ప్రాసెస్‌లో వాళ్లు కనీస సాయం కూడా చేయలేదు. పైగా కస్టమర్ సపోర్ట్ కోసం డబ్బులు కట్టమంటారు” అని ‘మోర్బిడ్ క్యూరియాసిటీ’ పేజీని రన్ చేస్తున్న అభిన్ టామ్ సెబాస్టియన్ అన్నారు. ఇన్‌స్టాగ్రామ్‌లో ‘బ్లూ టిక్’ (వెరిఫైడ్) కావడానికి మెటా నెలవారీ ఫీజు వసూలు చేస్తుంది, దీనివల్ల లైవ్ చాట్ ద్వారా 24 గంటలూ కస్టమర్ సపోర్ట్ దొరుకుతుంది. “నాకు రావాల్సిన అత్యంత కీలకమైన బ్రాండ్ కాంట్రాక్ట్‌లు వేరే క్రియేటర్ చేతికి వెళ్లిపోవడంతో నేను కోలుకోలేని దెబ్బ తిన్నాను. ఇలాంటివి మళ్లీ జరగవని చెప్పి మెటా నుంచి నాకు ఎలాంటి భరోసా గానీ సపోర్ట్ గానీ దొరకలేదు” అని సెబాస్టియన్ అన్నారు. కాగా, అసలైన కాపీరైట్ హక్కుదారులు లేదా వాళ్లు నియమించుకున్న ప్రతినిధులు మాత్రమే కాపీరైట్ ఉల్లంఘనపై ఫిర్యాదు చేయగలరని ఇన్‌స్టాగ్రామ్ చెబుతోంది. బాధితులు నేరుగా ఆ హక్కుదారులనే సంప్రదించాలని సూచిస్తోంది. ఏదైనమైనా ఇలాంటి మోసాలపై అప్రమత్తంగా ఉండాలని, అవసరమైతే పోలీసుల సహాయం తీసుకోవాలని నిపుణులు సూచిస్తున్నారు.



## స్వచ్ఛ గ్రామాలతోనే స్వర్ణాంధ్ర సాధ్యం

**ప్లాస్టిక్‌కు దూరంగా.. పరిశుభ్రతకు చేరువగా ముందడుగు వేయాలి.. స్వచ్ఛతా ర్యాలీలో జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ**

స్వచ్ఛమైన గ్రామాల నిర్మాణంతోనే స్వర్ణాంధ్ర లక్ష్యం సాకారమవుతుందని.. ప్రతిఒక్కరూ పరిశుభ్రతను సామాజిక బాధ్యతగా భావించి భాగస్వాములు కావాలని జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ పిలుపునిచ్చారు. ఇబ్రహీంపట్నం మండలం జూపూడి గ్రామంలో మంగళవారం జిల్లా పంచాయతీ కార్యాలయం ఆధ్వర్యంలో స్వర్ణాంధ్ర--స్వచ్ఛాంధ్ర అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ పాల్గొని గ్రామంలో నిర్వహించిన అవగాహన ర్యాలీలో ప్రజలు, అధికారులు, సిబ్బందితో కలిసి నడిచారు. స్వచ్ఛతా ర్యాలీలో భాగంగా ప్లాస్టిక్ వినియోగాన్ని నివారించాలి.. గ్రామాన్ని పరిశుభ్రంగా ఉంచాలి.. చెత్తను సక్రమంగా నిర్వహించాలి అంటూ సందేశాలు ఇచ్చే ప్లకార్డులను ప్రదర్శించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గ్రామంలో ఉత్పత్తి అయ్యే చెత్తను సక్రమంగా వేరుచేసి నిర్వహించడం ద్వారా చెత్త నుంచి సంపదను సృష్టించవచ్చని పేర్కొన్నారు. చెత్త నుంచి సంపద సృష్టి కేంద్రాన్ని సందర్శించిన ఆయన, అక్కడ మొక్కలు నాటారు. గ్రామాల్లో పారిశుద్ధ్య నిర్వహణ, వ్యర్థాల సేకరణ, వేరు చేయడం, పునర్వినియోగం వంటి అంశాలపై ప్రత్యేక దృష్టిసారించాలని అధికారులను ఆదేశించారు. ఇంటి నుంచే చెత్తను వేరు చేయడం ద్వారా పారిశుద్ధ్య నిర్వహణ మరింత సమర్థవంతంగా మారుతుందని చెప్పారు. సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వల్ల పర్యావరణానికి కలిగే నష్టాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ప్లాస్టిక్ కవర్లకు బదులుగా జ్యూట్, క్లాత్ బ్యాగులు వంటి పర్యావరణహిత ప్రత్యామ్నాయాలను వినియోగించాలని సూచించారు. ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించడం ప్రతి పౌరుడి బాధ్యతగా గుర్తించి, గ్రామాన్ని ప్లాస్టిక్ రహితంగా తీర్చిదిద్దేందుకు ప్రజలు సహకరించాలని కలెక్టర్ కోరారు. పరిశుభ్రత అనేది కేవలం ప్రభుత్వ శాఖల బాధ్యత కాదని, ప్రజల భాగస్వామ్యంతోనే స్వచ్ఛమైన గ్రామాలను నిర్మించగలమని కలెక్టర్ తెలిపారు. ఇంటి పరిశుభ్రత నుంచి గ్రామ పరిశుభ్రత.. గ్రామ పరిశుభ్రత నుంచి ఆరోగ్యకరమైన సమాజం.. ఆరోగ్యకరమైన సమాజం నుంచి స్వర్ణాంధ్ర దిశగా ప్రతి ఒక్కరూ తమ వంతు బాధ్యతను నిర్వర్తించాలని కలెక్టర్ లక్ష్మీశ పిలుపునిచ్చారు. కార్యక్రమంలో డీపీవో టి.సీతామహాలక్ష్మి, ఎంపీడీవో శకుంతుల, డీఎల్‌పీవో రాఘవన్, డిప్యూటీ ఎంపీడీవో మనోజ్, స్థానిక ప్రజలు తదితరులు పాల్గొన్నారు.



## మాదకద్రవ్యాల దుర్వినియోగంపై చట్టపరమైన అవగాహన కార్యక్రమం

**సీనియర్ సివిల్ జడ్జి మరియు నాంపల్లి క్రిమినల్ కోర్టు కార్యదర్శి (డిఎల్‌ఎస్‌ఏ) శ్రీమతి ఎ. శ్రీదేవి**

**జ్యోతి శ్వేత, క్రైమ్ బ్యూరో చీఫ్ అమీర్ హుస్సేన్**

**యువత మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలి: శ్రీమతి ఎ. శ్రీదేవి**




హైదరాబాద్, ఖైరతాబాద్: హైదరాబాద్, నాంపల్లి సెషన్స్ డివిజన్, జిల్లా న్యాయ సేవల అథారిటీ (డిఎల్‌ఎస్‌ఏ) ఆధ్వర్యంలో, ఖైరతాబాద్‌లోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మాదకద్రవ్యాల దుర్వినియోగం, నివారణ మరియు సంబంధిత చట్టపరమైన అంశాలపై ఒక అవగాహన కార్యక్రమం నిర్వహించబడింది. ఈ కార్యక్రమంలో భాగంగా విద్యార్థులతో మాదకద్రవ్య వ్యతిరేక అవగాహన ర్యాలీ కూడా నిర్వహించబడింది.

జిల్లా న్యాయ సేవల అథారిటీ (సెషన్స్ డివిజన్, నాంపల్లి, హైదరాబాద్) కార్యదర్శి శ్రీమతి ఎ. శ్రీదేవి ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. విద్యార్థులను ఉద్దేశించి ఆమె మాట్లాడుతూ, మాదకద్రవ్యాల వాడకం యువత ఆరోగ్యం, విద్య, భవిష్యత్తు మరియు కుటుంబ జీవితంపై తీవ్రమైన ప్రతికూల ప్రభావాన్ని చూపుతుందని నొక్కి చెప్పారు. చెడు స్నేహాలకు, మాదకద్రవ్యాల వాడకానికి మరియు ఇతర వ్యసనాలకు దూరంగా ఉండాలని ఆమె విద్యార్థులకు సలహా ఇచ్చారు.

మాదకద్రవ్యాల అక్రమ రవాణా, అమ్మకం, స్వాధీనం మరియు వినియోగం వంటి కార్యకలాపాలు నేరపూరితమైనవని, మరియు నార్కోటిక్ డ్రగ్స్ అండ్ సైకోట్రోపిక్ సబ్స్టాన్సెస్ యాక్ట్, 1985 (చీఞూూ యాక్ట్) ప్రకారం, నేరం యొక్క తీవ్రతను బట్టి కఠినమైన శిక్షలు మరియు జరిమానాలు విధించవచ్చని ఆమె వివరించారు. మాదకద్రవ్యాలకు సంబంధించిన నేరాల గురించి విద్యార్థులు చట్టపరంగా అవగాహన కలిగి ఉండటం యొక్క ప్రాముఖ్యతను ఆమె నొక్కి చెప్పారు.

మాదకద్రవ్యాలకు బానిసైన వ్యక్తులకు అవసరమైనప్పుడు వైద్య మరియు పునరావాస సహాయం అందించాల్సిన ఆవశ్యకతను కూడా ఆమె పేర్కొన్నారు. మాదకద్రవ్యాల వాడకం లేదా అక్రమ రవాణాకు సంబంధించి సమాచారం అందినప్పుడల్లా సంబంధిత అధికారులకు తెలియజేయడం ద్వారా ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా వ్యవహరించాలని, తద్వారా మాదకద్రవ్య రహిత సమాజాన్ని నిర్మించడంలో సహాయపడాలని ఆమె విజ్ఞప్తి చేశారు.

మత్తుపదార్థాల దుష్ప్రభావాల గురించి ప్రజలలో అవగాహన కల్పించేందుకు, కళాశాల విద్యార్థులు, అధ్యాపకులు మరియు సిబ్బంది కలిసి “మత్తుపదార్థాలకు వద్దు అని చెప్పండి”, “మత్తుపదార్థ రహిత సమాజం” వంటి నినాదాలతో ఒక అవగాహన ర్యాలీని నిర్వహించారు. ఈ ర్యాలీ ద్వారా, ప్రజలు మత్తుపదార్థాలకు దూరంగా ఉండాలని, ఆరోగ్యకరమైన, బాధ్యతాయుతమైన జీవనశైలిని అలవర్చుకోవాలని వారు సందేశం ఇచ్చారు.

మత్తుపదార్థాల అక్రమ రవాణా మరియు వాడకంపై తీసుకునే చట్టపరమైన చర్యలు, యువత మత్తుపదార్థాలకు బానిస కాకుండా ఉండేందుకు తీసుకోవలసిన జాగ్రత్తలు, అనుమానాస్పద కార్యకలాపాలను అధికారులకు నివేదించే విధానం వంటి పలు అంశాలపై పోలీసు అధికారులు విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ శ్రీ ప్రభు, వైస్ ప్రిన్సిపాల్ శ్రీ వినాయక కుమార్, అధ్యాపక మరియు సిబ్బంది, పారా-లీగల్ వాలంటీర్ (PLV) శ్రీ మహమ్మద్ అబ్దుల్ ఖాదర్, పోలీసు అధికారులు మరియు విద్యార్థులు పాల్గొన్నారు.

# రెండు పడక గదుల ఇండ్లలో లబ్ధిదారులే నివసించాలి: కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్

**గద్వాల, సెప్టెంబర్ 8, :**

ప్రభుత్వం నిర్మించిన రెండు పడక గదుల ఇండ్లలో ఎంపికైన లబ్ధిదారులే నివసించాలని, ఇండ్లను అద్దెకు ఇవ్వడం లేదా విక్రయించడం వంటి చర్యలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ హెచ్చరించారు. మంగళవారం పట్టణ శివారులోని రెండు పడక గదుల ఇండ్ల సముదాయాన్ని వివిధ శాఖల అధికారులతో కలిసి ఆకస్మికంగా తనిఖీ చేసిన ఆయన, లబ్ధిదారులతో నేరుగా మాట్లాడి సమస్యలను తెలుసుకున్నారు. పలు బ్లాకుల్లో పర్యటించిన కలెక్టర్ కొంతమంది లబ్ధిదారుల పట్టాలను పరిశీలించి అవసరమైన సూచనలు చేశారు. కొన్ని ఇండ్లు తాళం వేసి ఉండటాన్ని గమనించిన ఆయన, అక్కడ నివసించని లబ్ధిదారుల వివరాలను సేకరించాలని అధికారులను ఆదేశించారు. అటువంటి వారికి నోటీసులు జారీ చేసి పూర్తి వివరాలతో జాబితా సిద్ధం చేయాలని సూచించారు. ప్రభుత్వం అందించిన గృహాలను లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ కోరారు. కాలనీల్లో అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. రహదారులు, వీధి దీపాలకు సంబంధించిన సమస్యలను పరిష్కరిస్తామని తెలిపారు. గృహజ్యోతి పథకం ద్వారా ఉచిత విద్యుత్ సదుపాయం అందని అర్హులకు త్వరలోనే ప్రయోజనం కల్పించేలా చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.



పర్యటన సందర్భంగా ఒక చేనేత కార్మిక కుటుంబాన్ని కలిసిన కలెక్టర్, మగ్గంపై చీరల తయారీ, మార్కెటింగ్ అంశాలపై ఆరా తీశారు. అర్హులైన ప్రతి ఒక్క రూ పింఛన్ల కోసం దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల ప్రయోజనాలను ప్రజలు పూర్తిస్థాయిలో వినియోగిం చుకోవాలని కోరారు. కాలనీల్లో పరిశుభ్రతకు ప్రత్యేక ప్రాధాన్యం ఇవ్వాలని కలెక్టర్ సూచించారు. ప్రతి బ్లాక్‌లో నివాసితులతో కమిటీలు ఏర్పాటు చేసి పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని చెప్పారు. మహిళా స్వయం సహా యక సంఘాల సభ్యులు నిత్యావసర వస్తువుల విక్రయం కోసం షెడ్లు నిర్మించేలా చర్యలు తీసుకోవాలని అధికారు లను ఆదేశించారు. పరిసరాల్లో పెరిగిన పొదలను తొలగించి పరిశుభ్రమైన వాతావరణం కల్పించాలని సూచించారు. ఇండ్లు లేని అర్హులందరూ దరఖాస్తు చేసుకోవాలని, తదుపరి విడతలో అర్హులైన వారికి ఇండ్లు మంజూరు చేసే అంశాన్ని పరిశీలిస్తామని కలెక్టర్ తెలిపారు. కాలనీలో నిర్మించిన కమ్యూనిటీ హాల్‌ను స్థానికులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అనంతరం సమీపంలో నిర్మించిన ఇందిరా మహిళా శక్తి భవనాన్ని సందర్శించి అక్కడి పలు విభాగాలను పరిశీలించారు. ఈ పర్యటనలో హౌసింగ్ పీడీ శ్రీనివాసరావు, పంచాయతీరాజ్ ఈఈ ప్రభాకర్, డీఈలు నరేందర్, లక్ష్మణ్, తహసీల్దార్ హరికృష్ణ, మున్సిపల్ కమిషనర్ జానకిరామ్ సాగర్, ఏఈఈ సతీష్ తదితర అధికారులు పాల్గొన్నారు.



## ప్రభుత్వ పాఠశాలలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలి: కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్

**గద్వాల, సెప్టెంబర్ 8, :**

ప్రభుత్వ పాఠశాలల్లో అవసరమైన అన్ని మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నామని, విద్యార్థులు ప్రతిరోజూ పాఠశాలకు హాజరై వాటిని సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ అన్నారు. మంగళవారం పట్టణ శివారులోని రెండు పడక గదుల ఇండ్ల సముదాయం సమీపంలో ఉన్న ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలను ఆయన సందర్శించి విద్యా బోధన, మౌలిక సదుపాయాల పరిస్థితిని పరిశీలించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో నేరుగా మాట్లాడిన కలెక్టర్, వారి చదువు, రాత, పాఠ్యపుస్తకాల వినియోగం గురించి అడిగి తెలుసుకున్నారు. ఏకరూప దుస్తులు, విద్యా సామగ్రి అందుబాటులో ఉన్నాయా లేదా అనే విషయాలను కూడా పరిశీలించారు. విద్యార్థులు ఆసక్తిగా చదువుకోవాలని, విద్య ద్వారా ఉన్నత లక్ష్యాలను సాధించాలని సూచించారు. పాఠశాలలో అమలవుతున్న మధ్యాహ్న భోజన పథకంపై కూడా కలెక్టర్ ఆరా తీశారు. విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందించాలని అధికారులను ఆదేశించారు. రాగి జావ లేదా పాలను క్రమం తప్పకుండా అందించడంతో పాటు పిల్లల పోషకాహారంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. పాఠశాలలో తగినన్ని తరగతి గదులు, ఇతర సదుపాయాలు ఉన్నందున వాటిని పూర్తిస్థాయిలో వినియోగించుకునేలా విద్యార్థుల సంఖ్య పెరగాలని కలెక్టర్ అభిప్రాయపడ్డారు. విద్యార్థుల హాజరు శాతం తక్కువగా ఉండటంపై ఆందోళన వ్యక్తం చేస్తూ ప్రతి చిన్నారి క్రమం తప్పకుండా పాఠశాలకు వచ్చేలా ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. పలువురు విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలను పరిశీలించిన కలెక్టర్, వారి ప్రతిభను అభినందించారు.

# స్త్రీనిధి రుణాలతో మహిళలకు స్వయం ఉపాధి అవకాశాలు

**గద్వాల, సెప్టెంబర్ 8, :**

మహిళా స్వయం సహాయక సంఘాలకు ప్రభుత్వం అందిస్తున్న స్త్రీనిధి రుణాలను సద్వినియోగం చేసుకొని ఆర్థికంగా అభివృద్ధి చెందాలని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ సూచించారు. జిల్లా గ్రామీణ అభివృద్ధి శాఖ, సెర్ప్ సహకారంతో స్త్రీనిధి ద్వారా మంజూరైన రుణాలతో కొనుగోలు చేసిన ఎలక్ట్రిక్ ఆటోలను మంగళవారం ఐడీఓసీ ప్రాంగణంలో ఆయన ప్రారంభించారు. స్త్రీనిధి రుణాల కింద ఒక్కో లబ్ధిదారుకు రూ.3 లక్షల చొప్పున మంజూరు కావడంతో ఇద్దరు మహిళలు ఎలక్ట్రిక్ ఆటోలను కొనుగోలు చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మహిళల ఆర్థిక సాధికారత కోసం ప్రభుత్వం పెద్ద ఎత్తున రుణ సదుపాయాలు కల్పిస్తోందని తెలిపారు. స్వయం ఉపాధి అవకాశాలను వినియోగించుకొని మహిళలు తమ కుటుంబాల ఆర్థిక స్థితిని మెరుగు పరచుకోవాలని సూచించారు.ప్రత్యేకించి గట్టు మండలం వంటి రవాణా సౌకర్యాలు పరిమితంగా ఉన్న ప్రాంతాల్లో మహిళలకు ఎలక్ట్రిక్ ఆటోలు ఉపాధితో పాటు ఆదాయ వనరుగా మారతాయని కలెక్టర్ పేర్కొన్నారు. ఇలాంటి వాహనాలు





అందుబాటులోకి రావడం వల్ల గ్రామీణ ప్రాంతాల్లో రవాణా సేవలు మెరుగుపడటంతో పాటు మహిళలకు స్థిరమైన ఆదాయం లభిస్తుందని చెప్పారు. ఎలక్ట్రిక్ వాహనాల వినియోగం పర్యావ రణ పరిరక్షణకు కూడా దోహదపడుతుందని ఆయన తెలిపారు. కాలుష్య నియంత్రణ, ఇంధన వ్యయాల తగ్గింపు వంటి ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకొని ఎలక్ట్రిక్ వాహనాలను ప్రోత్సహిస్తున్నామని వివరించారు. భవిష్య త్తులో మరిన్ని మహిళా సంఘాలకు ఇలాంటి అవకాశాలు కల్పించేందుకు చర్యలు తీసుకుంటామని పేఈ సందర్భంగా ఆటోల మైలేజీ, నిర్వహణ ఖర్చులు, సర్వీసింగ్ సదుపాయాలపై లబ్ధిదారులతో కలెక్టర్ మాట్లాడారు. అనంతరం డీఆర్‌డీఓతో కలిసి ఎలక్ట్రిక్ ఆటోలో ప్రయాణించి వాహన పనితీరును స్వయంగా పరిశీలిం చారు. ఈ కార్యక్రమంలో డీఆర్‌డీఓ ముషాహిదా బేగం, డీపీఎం సలోమి, స్త్రీనిధి రీజినల్ మేనేజర్ సందీప్, ఏపీఎంలు, ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు. మహిళా సంఘాల అభివృద్ధికి ప్రభుత్వం అందిస్తున్న పథకాలను వినియోగించుకొని ఆర్థికంగా బలోపేతం కావాలని అధికారులు సూచించారు.



## అస్వస్థతకు గురైన అధికారికి సీపీఆర్ చేసిన మంత్రి వాకిటి శ్రీహరి

**హైదరాబాద్, సెప్టెంబర్ 8, :**

తెలంగాణ అసెంబ్లీ ఆవరణలో మంగళవారం అకస్మాత్తుగా అస్వస్థతకు గురైన ఓ అధికారికి మంత్రి వాకిటి శ్రీహరి తక్షణ సహాయం అందించి మానవత్వాన్ని చాటుకున్నారు. నవీన్ మిట్టల్ వ్యక్తిగత కార్యదర్శి (పీఎస్) రాజు ఒక్కసారిగా కుప్పకూలడంతో అక్కడున్నవారిలో ఆందోళన నెలకొంది. పరిస్థితిని గమనించిన మంత్రి వాకిటి శ్రీహరి వెంటనే స్పందించి రాజు వద్దకు చేరుకున్నారు. వైద్య సిబ్బంది వచ్చేలోపే ప్రాథమిక చికిత్స అందించేందుకు చర్యలు చేపట్టారు. అత్యవసర పరిస్థితిని అంచనా వేసి సీపీఆర్ నిర్వహించారు. మంత్రి అందించిన సకాల సహాయంతో బాధితుడి పరిస్థితిని స్థిరీకరించేందుకు ప్రయత్నించారు. అనంతరం వెంటనే వైద్య సిబ్బందికి సమాచారం అందించి అత్యవసర వైద్య సేవలు అందేలా చర్యలు తీసుకున్నారు. సమాచారం అందుకున్న వైద్య సిబ్బంది ఘటనాస్థలికి చేరుకుని రాజుకు వైద్య పరీక్షలు నిర్వహించారు. తదుపరి చికిత్స కోసం అంబులెన్సులో సమీప ఆసుపత్రికి తరలించారు. ఈ ఘటనతో అసెంబ్లీ ఆవరణలో కొద్దిసేపు ఆందోళన వాతావరణం నెలకొంది. అయితే మంత్రి, వైద్య సిబ్బంది తక్షణ స్పందనతో బాధితుడికి వెంటనే వైద్య సహాయం అందింది. రాజు ఆరోగ్య పరిస్థితిపై వైద్యులు పర్యవేక్షణ కొనసాగిస్తున్నట్లు సమాచారం. అసెంబ్లీ ప్రాంగణంలో ఉన్న ప్రజాప్రతినిధులు, అధికారులు ఆయన త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు.

# రామప్ప దేవాలయ పరిరక్షణకు అత్యంత ప్రాధాన్యం: కలెక్టర్

**, సెప్టెంబర్ 8, :**

యునెస్కో ప్రపంచ వారసత్వ కట్టడమైన రామప్ప దేవాలయ పరిరక్షణకు అత్యంత ప్రాధాన్యం ఇస్తున్నామని ములుగు జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు తెలిపారు. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని వీడియో సమావేశ మందిరంలో మంగళవారం పాలంపేట ప్రత్యేక అభివృద్ధి ప్రాధికార సంస్థ కమిటీ సమావేశం నిర్వహించి పలు కీలక అంశాలపై చర్చించారు. వెంకటాపూర్ మండల పరిధిలో ప్రతిపాదిత ఓపెన్‌కాస్ట్ మైనింగ్ కార్యకలాపాల వల్ల కాకతీయ రుద్రేశ్వర (రామప్ప) దేవాలయానికి ఎలాంటి ప్రభావం పడకుండా తీసుకోవాల్సిన చర్యలపై సమావేశంలో సమగ్రంగా చర్చించారు. మైనింగ్ ప్రాజెక్టుకు నిరభ్యంతర ధ్రువీకరణ పత్రం మంజూరు అంశాన్ని కూడా కమిటీ పరిశీలించింది. సమావేశంలో పాల్గొన్న వివిధ శాఖల అధికారులు తమ పరిధిలోని అభిప్రాయాలను వెల్లడించారు. పర్యావరణ పరిరక్షణ, వారసత్వ సంపద సంరక్షణ, భద్రతా ప్రమాణాలు, శాస్త్రీయ అధ్యయనాల అవసరంపై విస్తృత చర్చ జరిగింది. దేవాలయ నిర్మాణంపై భవిష్యత్తులో ఎలాంటి ప్రతికూల ప్రభావం లేకుండా



జాగ్రత్తలు తీసుకోవాలని సభ్యులు సూచించారు. రామప్ప దేవాలయానికి సంబంధించి నిరంతర పర్యవేక్షణ, శాస్త్రీయ విశ్లేషణలు, భూకంప ప్రకంపనలు లేదా మైనింగ్ కార్యకలాపాల ప్రభావాలపై అధ్యయనాలు నిర్వహించావల్సిన అవసరాన్ని సమావేశంలో ప్రస్తావించారు. పురావస్తు, అటవీ, పర్యావరణ శాఖల సూచనలను పరిగణనలోకి తీసుకోవాలని నిర్ణయించారు. సంబంధిత శాఖల అధికారులు, కమిటీ సభ్యులు వెల్లడించిన అభిప్రాయాలను నమోదు చేసినట్లు కలెక్టర్ తెలిపారు. అన్ని అంశాలను సమగ్రంగా పరిశీలించి, నిబంధనలు, భద్రతా ప్రమాణాలు, వారసత్వ కట్టడాల సంరక్షణకు సంబంధించిన అంశాలపై పూర్తి స్థాయి అధ్యయనం అనంతరమే తదుపరి నిర్ణయం తీసుకుంటామని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో జిల్లా అటవీ శాఖ అధికారి వికాస్ మీనా, సింగరేణి భూపాలపల్లి జీఎం రాజేశ్వర్‌రెడ్డి, ప్రాజెక్ట్స్ అండ్ ప్లానింగ్ జీఎం దేవేందర్, పర్యావరణ విభాగం జీఎం సైదులు, పురావస్తు శాఖ అధికారులు, భారత పురావస్తు సర్వేక్షణ శాఖ ప్రతినిధులు, కాకతీయ హెరిటేజ్ ట్రస్ట్ సభ్యులు, వివిధ శాఖల అధికారులు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.



## ప్రీ-ప్రైమరీ జోన్‌ను ప్రారంభించిన కలెక్టర్

**ఆదిలాబాద్, సెప్టెంబర్ 8, :**

మావల మండల కేంద్రంలోని మండల పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన ప్రీ-ప్రైమరీ జోన్‌ను జిల్లా కలెక్టర్ రాజర్షిషా మంగళవారం ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు స్కూల్ బ్యాగులు, వాటర్ బాటిళ్లను పంపిణీ చేశారు. చిన్నారులకు నాణ్యమైన విద్యతో పాటు ఆకర్షణీయమైన అభ్యసన వాతావరణాన్ని కల్పించేందుకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపడుతోందని కలెక్టర్ తెలిపారు. పాఠశాలలో ఏర్పాటు చేసిన ఇండోర్, అవుట్‌డోర్ ఆట వస్తువులను కలెక్టర్ పరిశీలించారు. పిల్లల్లో సృజనాత్మకత, మానసిక వికాసం పెంపొందిం చేందుకు ఆటల ఆధారిత బోధన ఎంతో ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. చిన్నారు లు ఆనందంగా నేర్చుకునే విధంగా విద్యా వాతావరణాన్ని రూపొందించడం అవసర మని తెలిపారు.డ్యాన్సులు, పాటలు పాడేందుకు ఏర్పాటు చేసిన మైక్ సెట్లు, ఇతర సౌకర్యాలను పరిశీలించిన కలెక్టర్, విద్యతో పాటు సహపాఠ్య కార్యక్రమాలు కూడా విద్యార్థుల సమగ్రాభివృద్ధికి దోహదపడతాయని అన్నారు.

# ఈవీఎం గోదాంను పరిశీలించిన జిల్లా కలెక్టర్ స్నేహ శబరిష్

**మహబూబాబాద్, సెప్టెంబర్ 8, :**

త్రైమాసిక తనిఖీల్లో భాగంగా మహబూబాబాద్ జిల్లా కలెక్టర్ స్నేహ శబరిష్ మంగళవారం కలెక్టరేట్ సమీపంలో ఉన్న ఈవీఎం గోదాంను పరిశీలించారు. ఈ తనిఖీలో సంబంధిత అధికారులు, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు కూడా పాల్గొన్నారు. ఈ సందర్భంగా గోదాంలో భద్రపరిచిన ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాలు (ఈవీఎంలు), వీవీప్యాట్ యంత్రాల భద్రతా ఏర్పాట్లను కలెక్టర్ పరిశీలించారు. ఎన్నికల సామగ్రి భద్రతకు సంబంధించిన నిబంధనలు సక్రమంగా అమలవుతున్నాయా అనే విషయంపై ఆరా తీశారు. గోదాం వద్ద ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలు, భద్రతా సిబ్బంది విధులు, ప్రవేశ నియంత్రణ వ్యవస్థలను పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. ఎన్నికల సంఘం మార్గదర్శకాలకు అనుగుణంగా అన్ని చర్యలు కొనసాగించాలని ఆదేశించారు. యంత్రాల భద్రత విషయంలో ఎలాంటి నిర్లక్ష్యానికి తావు లేకుండా అప్రమత్తంగా వ్యవహరించాలని సంబంధిత అధికారులకు సూచించారు. గోదాం



పరిసరాల్లో పరిశుభ్రత, భద్రతా ప్రమాణాలను నిరంతరం కొనసాగించాలని పేర్కొన్నారు. ఈ సందర్భంగా రాజకీయ పార్టీల ప్రతినిధులకు గోదాంలో ఉన్న ఏర్పాట్లను అధికారులు వివరించారు. ఎన్నికల ప్రక్రియపై ప్రజల్లో విశ్వాసం పెంపొందించేలా పారదర్శకతతో వ్యవహరించాలని కలెక్టర్ సూచించారు. ఈ తనిఖీలో ఎన్నికల శాఖ అధికారులు, భద్రతా సిబ్బంది, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు. ఎన్నికల సామగ్రి భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇస్తూ అవసరమైన అన్ని చర్యలు కొనసాగిస్తున్నట్లు అధికారులు తెలిపారు.



# అందరికీ అందుబాటులో ఆరోగ్య సేవలే లక్ష్యం: కేంద్ర మంత్రి జేపీ నడ్డా

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 8, ::

ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూహెచ్ఓ) దక్షిణ-ఆగ్నేయాసియా ప్రాంతీయ కమిటీ 79వ సమావేశంలో నిర్వహించిన మంత్రుల రౌండ్‌టేబుల్ సమావేశంలో కేంద్ర ఆరోగ్య శాఖ మంత్రి జేపీ నడ్డా పాల్గొన్నారు. ఈ సందర్భంగా సమానత్వంతో కూడిన, అందరికీ అందుబాటులో ఉండే ఆరోగ్య సేవల కల్పన పట్ల భారతదేశం కట్టుబడి ఉందని ఆయన స్పష్టం చేశారు. దేశవ్యాప్తంగా ఆరోగ్య మౌలిక వసతులను బలోపేతం చేయడంతో పాటు ఆరోగ్య సిబ్బంది సామర్థ్యాన్ని పెంపొందించేందుకు కేంద్ర ప్రభుత్వం చేపడుతున్న చర్యలను వివరించారు. వైద్య సేవలు అందని ప్రాంతాల్లో మెడికల్ విద్యను విస్తరిస్తున్నామని, తద్వారా గ్రామీణ ప్రాంతాల్లో వైద్యుల కొరతను తగ్గించేందుకు కృషి చేస్తున్నామని మంత్రి తెలిపారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల నుంచి రిఫరల్ ఆసుపత్రుల వరకు సేవల నాణ్యతను మెరుగుపరుస్తున్నామని పేర్కొన్నారు. క్లిష్ట ప్రాంతాల్లో నిపుణులైన వైద్యుల లభ్యత పెంచేందుకు ప్రత్యేక చర్యలు చేపడుతున్నట్లు వెల్లడించారు. డిజిటల్ ఆరోగ్య రంగంలో భారత్ గణనీయమైన పురోగతి సాధించిందని జేపీ నడ్డా అన్నారు. ఈ-సంజీవని వంటి టెలీమెడిసిన్ సేవలు, ఏబీహెచ్‌ఏ ఆధారిత డిజిటల్ ఆరోగ్య రికార్డుల ద్వారా ప్రజలకు వేగవంతమైన వైద్య సేవలు అందుతున్నాయని చెప్పారు. డిజిటల్ సాంకేతికతను వినియోగిస్తూ ఆరోగ్య సేవలను మరింత సమర్థవంతంగా ప్రజలకు చేరవేస్తున్నట్లు వివరించారు. ప్రతి పౌరుడికి నాణ్యమైన వైద్య సేవలు అందించాలనే లక్ష్యంతో ప్రభుత్వం పనిచేస్తోందని కేంద్ర మంత్రి పేర్కొన్నారు. సార్వత్రిక ఆరోగ్య సంరక్షణ సాధన దిశగా బహుళ నైపుణ్యాలు కలిగిన ఆరోగ్య సిబ్బందిని తీర్చిదిద్దుతున్నామని తెలిపారు. గ్రామీణ, మారుమూల ప్రాంతాల ప్రజలకు సకాలంలో ఆరోగ్య సేవలు అందేలా చర్యలు కొనసాగుతున్నాయని చెప్పారు. ఆరోగ్య రంగంలో సమగ్ర అభివృద్ధి ద్వారా దేశ ప్రజల జీవన ప్రమాణాలను మెరుగుపరచడమే ప్రభుత్వ లక్ష్యమని జేపీ నడ్డా స్పష్టం చేశారు. భవిష్యత్తులో కూడా ఆరోగ్య సేవల విస్తరణ, వైద్య సిబ్బంది బలోపేతం, డిజిటల్ ఆరోగ్య వ్యవస్థ అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారిస్తామని పేర్కొన్నారు.



# బీఆర్ఎస్ ఎమ్మెల్సీలకు కోర్టులో ఊరట.. రిమాండ్ తిరస్కరణ

హైదరాబాద్, సెప్టెంబర్ 8, ::

తెలంగాణ శాసనసభ ఆవరణలో చోటుచేసుకున్న ఉద్రిక్త ఘటనల కేసులో అరెస్టైన బీఆర్ఎస్ ఎమ్మెల్సీలు తాతా మధు, నవీన్‌కుమార్ రెడ్డిలకు నాంపల్లి కోర్టులో ఊరట లభించింది. వారిని జ్యుడీషియల్ రిమాండ్‌కు తరలించాలంటూ పోలీసులు చేసిన విజ్ఞప్తిని న్యాయస్థానం తిరస్కరించింది. దీంతో ఇద్దరు ఎమ్మెల్సీలను వెంటనే విడుదల చేయాలని ఆదేశాలు జారీ చేసింది. ఈ పరిణామం రాష్ట్ర రాజకీయాల్లో చర్చనీయాంశంగా మారింది. అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్‌పై అనుచిత వ్యాఖ్యలు చేశారనే ఆరోపణలతో పాటు, విధి నిర్వహణలో ఉన్న పోలీసుల విధులకు ఆటంకం కలిగించి దాడికి పాల్పడ్డారనే అభియోగాలపై పోలీసులు ఎమ్మెల్సీలు తాతా మధు, నవీన్‌కుమార్ రెడ్డిలపై కేసులు నమోదు చేశారు. అసెంబ్లీ ప్రాంగణంలో జరిగిన ఉద్రిక్త పరిస్థితుల అనంతరం వారిని అదుపులోకి తీసుకుని నాంపల్లి కోర్టులో హాజరుపరిచారు. కోర్టులో విచారణ సందర్భంగా పోలీసులు రిమాండ్ అవసరమని వాదించగా, ఎమ్మెల్సీల తరఫు న్యాయవాదులు తమ వాదనలు వినిపించారు. కేసుకు సంబంధించిన అంశాలను పరిశీలించిన న్యాయస్థానం, ఈ దశలో రిమాండ్ అవసరం లేదని అభిప్రాయపడింది. దీంతో పోలీసుల అభ్యర్థనను తోసిపుచ్చుతూ బెయిల్ మంజూరు చేసింది. న్యాయస్థానం ఆదేశాల మేరకు ఇద్దరు ఎమ్మెల్సీలు రూ.10 వేల చొప్పున వ్యక్తిగత పూచీకత్తు సమర్పించాలని సూచించింది. పూచీకత్తు సమర్పించిన వెంటనే వారిని విడుదల చేయాలని స్పష్టం చేసింది. దీంతో అరెస్టు అనంతరం కొద్ది గంటల్లోనే వారికి చట్టపరమైన ఉపశమనం లభించినట్లయింది.

అసెంబ్లీ సమావేశాల సందర్భంగా అధికార, ప్రతిపక్షాల మధ్య నెలకొన్న ఉద్రిక్తతల నేపథ్యంలో ఈ కేసు రాజకీయంగా ప్రాధాన్యత సంతరించుకుంది. ఒకవైపు శాసనమండలిలో తాతా మధు, నవీన్‌కుమార్ రెడ్డిలపై సస్పెన్షన్ చర్యలు అమలులో ఉండగా, మరోవైపు కోర్టు రిమాండ్‌ను తిరస్కరించడం రాజకీయ వర్గాల్లో చర్చకు దారితీసింది. కోర్టు తాజా నిర్ణయంతో ఈ వ్యవహారం మరో మలుపు తిరిగింది. అసెంబ్లీ ఆవరణ ఘటనకు సంబంధించిన దర్యాప్తు కొనసాగుతుండగా, భవిష్యత్తులో ఈ కేసు ఎలాంటి పరిణామాలకు దారితీస్తుందన్న అంశంపై రాజకీయ, న్యాయ వర్గాల్లో ఆసక్తి నెలకొంది. ప్రస్తుతం కోర్టు ఆదేశాల మేరకు ఇద్దరు ఎమ్మెల్సీలు విడుదల కానున్నారు.

# ఉగ్రవాద నిరోధక వ్యూహాలపై సంయుక్త శిక్షణ పూర్తి

పుణె, సెప్టెంబర్ 8, :






ఉగ్రవాద నిరోధక వ్యూహాలపై రెండు వారాలపాటు నిర్వహించిన మిలిటరీ--సివిల్ ఫ్యూజన్ శిక్షణ కార్యక్రమం విజయ వంతంగా ముగిసింది. ఆగస్టు 24 నుంచి సెప్టెంబర్ 5 వరకు కొనసాగిన ఈ శిక్షణను ఏఎస్‌జీ పుణె సమన్వయంతో, భారత సైన్యానికి చెందిన సదరన్ కమాండ్ సహకారంతో నిర్వహించారు. భద్రతా సిబ్బంది కార్యాచరణ సామర్థ్యాలను పెంపొందించేందుకు ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఉగ్రవాద నిరోధక చర్యల్లో ఎదురయ్యే సవాళ్లను సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు అవసరమైన వ్యూహాలు, సాంకేతిక అంశాలపై శిక్షణలో అవగాహన కల్పించారు. వివిధ రకాల ప్రమాద పరిస్థితుల్లో స్పందించే విధానాలు, భద్రతా చర్యల అమలు, సమన్వయ పద్ధతులపై పాల్గొనువారికి ప్రాయోగిక శిక్షణ అందించారు. మిలిటరీ, పౌర భద్రతా వ్యవస్థల మధ్య సమన్వయాన్ని బలోపేతం చేయడం ఈ శిక్షణ ప్రధాన లక్ష్యంగా నిలిచింది. ఉగ్రవాద కార్యక లాపాలను అడ్డుకోవడం, అత్యవసర పరిస్థితుల్లో వేగంగా స్పందించడం, వ్యూహాత్మక నిర్ణయాలు తీసుకోవడం వంటి అంశాలపై ప్రత్యేక తరగతులు నిర్వహించారు. శిక్షణలో పాల్గొన్న సిబ్బంది కార్యాచరణ సిద్ధత, వ్యూహాత్మక అవగాహన, క్షేత్రస్థాయి నైపుణ్యాలను మరింత మెరుగు పరుచుకున్నారు. వాస్తవ పరిస్థితులకు దగ్గరగా ఉండే నమూనా విన్యాసాల ద్వారా ప్రతిస్పందన సామర్థ్యాలను పెంపొందించే ప్రయత్నం చేశారు. దీంతో భవిష్యత్తులో ఎదురయ్యే భద్రతా సవాళ్లను మరింత సమర్థంగా ఎదుర్కొనే అవకాశాలు మెరుగుపడ్డాయి. భద్రతా వ్యవస్థల్లో శిక్షణ కీలక పాత్ర పోషిస్తుందని నిర్వాహకులు పేర్కొన్నారు.o

# బకాయిల కోసం పోరాడితే లాఠీచార్జ్ చేశారు: ఎన్. రామచంద్రరావు



హైదరాబాద్, సెప్టెంబర్ 8, : ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిల విడుదల కోసం చేపట్టిన 'చలో అసెంబ్లీ' కార్యక్రమంలో పోలీసులు వ్యవహరించిన తీరుపై బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రామచంద్రరావు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. బకాయిల కోసం ఎదురుచూస్తున్న లక్షలాది మంది విద్యార్థుల తరఫున నిర్వహించిన ఆందోళనపై ప్రభుత్వం దమనకాండకు పాల్పడిందని ఆరోపించారు. ఈ సందర్భంగా లాఠీచార్జ్‌లో గాయపడి చికిత్స పొందుతున్న బీజేపీ కార్యకర్తలను ఆయన పరామర్శించారు. అనంతరం మాట్లాడిన రామచంద్రరావు, ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిల చెల్లింపులో ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని విమర్శించారు. రాష్ట్రవ్యాప్తంగా సుమారు 40 లక్షల మంది విద్యార్థులు బకాయిల కోసం ఎదురుచూస్తున్నప్పటికీ ప్రభుత్వం స్పందించడం లేదని అన్నారు. విద్యార్థుల భవిష్యత్తుతో చెలగాటమాడే విధానాలను వెంటనే విరమించుకోవాలని డిమాండ్ చేశారు.

ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిల విడుదల కోరుతూ ప్రజాస్వామ్యబద్ధంగా నిర్వహించిన కార్యక్రమాన్ని అడ్డుకోవడం దురదృష్టకరమని రామచంద్రరావు పేర్కొన్నారు. సమస్యలను పరిష్కరించాల్సిన ప్రభుత్వం ఆందోళనకారులపై లాఠీలు ఝుళిపించడం ప్రజాస్వామ్యానికి విరుద్ధమని విమర్శించారు. ప్రజల గొంతును అణచివేసే ప్రయత్నాలను బీజేపీ ఎప్పటికీ సహించబోదని స్పష్టం చేశారు. లాఠీచార్జ్‌లో గాయపడిన వారు కేవలం బీజేపీ కార్యకర్తలు మాత్రమే కాదని, వారి ద్వారా తెలంగాణ విద్యార్థుల ఆకాంక్షలపై దాడి జరిగిందని రామచంద్రరావు వ్యాఖ్యానించారు. విద్యార్థుల సమస్యల పరిష్కారం కోసం చేసిన పోరాటాన్ని ప్రభుత్వం బలప్రయోగంతో అణచివేయాలని చూడటం బాధాకరమని అన్నారు.





# ఆహార ధాన్యాల నిర్వహణ ఆధునికీకరణకు కీలక ఒప్పందం

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 8, :

ఆహార మరియు ప్రజా పంపిణీ శాఖ (డీఎఫ్‌పీడీ), భారత ఆహార సంస్థ (ఎఫ్‌సీఐ) మధ్య 2026--27 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన అవగాహన ఒప్పందం (ఎంఓయూ) మంగళవారం న్యూఢిల్లీలో కుదిరింది. ఆహార ధాన్యాల నిర్వహణ వ్యవస్థను మరింత సమర్థవంతంగా తీర్చిదిద్దడం, ఆధునికీకరణ వేగవంతం చేయడం ఈ ఒప్పందం ప్రధాన లక్ష్యంగా ఉంది. ఈ ఎంఓయూ ద్వారా ఎఫ్‌సీఐ పనితీరుకు సంబంధించి సమగ్ర పనితీరు చట్రాన్ని రూపొందించారు. సంస్థ కార్యకలాపాల్లో సామర్థ్యాన్ని పెంచడం, జవాబుదా రీతనాన్ని బలోపేతం చేయడం, సేవల నాణ్యతను మెరుగుపరచడం కోసం స్పష్టమైన లక్ష్యాలను నిర్దేశించా రు. నిర్ణయించిన లక్ష్యాల ఆధారంగా పనితీరును అంచనా వేయనున్నారు. ఆహార ధాన్యాల నిల్వ సమయంలో జరిగే నష్టాలను తగ్గించడం ఈ ఒప్పందంలోని ప్రధాన అంశా ల్లో ఒకటి. గోదాముల నిర్వహణను మరింత సమర్థవంతంగా చేపట్టి నిల్వ సామర్థ్యాన్ని పూర్తిస్థాయిలో వినియోగించుకునేలా చర్యలు తీసుకోనున్నారు. ధాన్యాల భద్రత, నిల్వ నాణ్యతపై ప్రత్యేక దృష్టి సారించనున్నారు. లాజిస్టిక్స్, సరఫరా వ్యవస్థను మెరుగుపరచడం ద్వారా ధాన్యాల రవాణా, పంపిణీ ప్రక్రియలను మరింత వేగవంతం చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించి సరఫరా వ్యవస్థలో పారదర్శకత, సామర్థ్యాన్ని పెంచేందుకు చర్యలు చేపట్టను న్నారు. నాణ్యత నియంత్రణ వ్యవస్థలను బలోపేతం చేయడం కూడా ఎంఓయూలో కీలక అంశంగా ఉంది. వినియోగదారులకు నాణ్యమైన ఆహార ధాన్యాలు అందేలా పర్యవేక్షణ వ్యవస్థలను మరింత పటిష్టం చేయాలని నిర్ణయించారు. ఇందుకోసం ప్రమాణాలకు అనుగుణంగా తనిఖీలు, నాణ్యత పరీక్షలు నిర్వహించనున్నారు. ఈ అవగాహన ఒప్పందం ద్వారా దేశవ్యాప్తంగా ఆహార ధాన్యాల సేకరణ, నిల్వ, రవాణా, పంపిణీ వ్యవస్థల్లో మరింత సామర్థ్యం పెరుగుతుందని అధికారులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. ప్రజా పంపిణీ వ్యవస్థను మరింత సమర్థవంతంగా తీర్చిదిద్దడంలో ఈ ఒప్పందం కీలక మైలురాయిగా నిలవనుందని పేర్కొన్నారు.

# ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై కేసు నమోదు చేయాలని బీఆర్ఎస్ ఫిర్యాదు

హైదరాబాద్, సెప్టెంబర్ 8, :



ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై క్రిమినల్ కేసు నమోదు చేయాలని కోరుతూ బీఆర్ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్.ఎస్. ప్రవీణ్ కుమార్ మంగళవారం బంజారాహిల్స్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. భారతీయ న్యాయ సంహిత (బీఎన్ఎస్)లోని పలు సెక్షన్ల కింద ఎఫ్ఐఆర్ నమోదు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా పలువురు బీఆర్ఎస్ నాయకులు, మహిళా నాయకులు ఆయన వెంట ఉన్నారు. ఫిర్యాదులో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో పాటు షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్‌పైనా క్రిమినల్ కేసులు నమోదు చేయాలని కోరినట్లు బీఆర్ఎస్ నేతలు తెలిపారు. ఇటీవల చేసిన వ్యాఖ్యలు సామాజిక ఉద్రిక్తతలకు దారితీసే విధంగా ఉన్నాయని ఆరోపించారు. ఈ అంశంపై పోలీసులు తక్షణమే స్పందించాలని కోరారు. తెలంగాణ ఉద్యమ నాయకుడు, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌కు సంబంధించిన వ్యాఖ్యలపై బీఆర్ఎస్ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసింది. కేసీఆర్ గురించి చేసిన వ్యాఖ్యలు అనుచితమని, వాటిని తీవ్రంగా ఖండిస్తున్నామని ఆర్.ఎస్. ప్రవీణ్ కుమార్ పేర్కొన్నారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో రాజకీయ విభేదాలు ఉండవచ్చని, అయితే వ్యక్తిగత స్థాయిలో ఇలాంటి వ్యాఖ్యలు చేయడం సరికాదని అన్నారు. ఈ అంశంపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని పోలీసులకు సమర్పించిన ఫిర్యాదులో బీఆర్ఎస్ నేతలు కోరారు. రాజకీయ నాయకులు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని, ప్రజలను రెచ్చగొట్టే వ్యాఖ్యలను నివారించాలని సూచించారు. రాష్ట్రంలో శాంతిభద్రతలకు భంగం కలగకుండా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. బంజారాహిల్స్ పోలీస్ స్టేషన్‌కు చేరుకున్న బీఆర్ఎస్ నాయకులు ఫిర్యాదు పత్రాన్ని అధికారులకు అందజేశారు. ఫిర్యాదును స్వీకరించిన పోలీసులు చట్టపరమైన అంశాలను పరిశీలించి తదుపరి చర్యలు తీసుకుంటామని తెలిపినట్లు సమాచారం. ఈ పరిణామం రాష్ట్ర రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. ఆర్.ఎస్. ప్రవీణ్ కుమార్‌తో పాటు మాజీ ఎమ్మెల్సీ కర్నె ప్రభాకర్, పలువురు బీఆర్ఎస్ నాయకులు, మహిళా నాయకులు పోలీస్ స్టేషన్‌కు హాజరయ్యారు. కేసీఆర్‌పై చేసిన వ్యాఖ్యలను ఖండిస్తూ వారు తమ నిరసనను వ్యక్తం చేశారు.



# విజయ్‌పై గర్వంగా ఉంది: ఎస్.ఏ. చంద్రశేఖర్

చెన్నై, సెప్టెంబర్ 8, :

తమిళనాడు ముఖ్యమంత్రి విజయ్ చుట్టూ రాజకీయ, వ్యక్తిగత వివాదాలు కొనసాగుతున్న సమయంలో ఆయన తండ్రి, సీనియర్ దర్శకుడు ఎస్.ఏ. చంద్రశేఖర్ చేసిన వ్యాఖ్యలు సినీ, రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారాయి. ఇటీవల జరిగిన రాజకీయ పరిణామాలు, అసెంబ్లీలో చోటుచేసుకున్న చర్చల అనంతరం మీడియాతో మాట్లాడిన ఆయన తన కుమారుడు విజయ్‌పై ఎంతో గర్వంగా ఉందని పేర్కొన్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో విజయ్ వ్యవహరిస్తున్న తీరు తనకు సంతోషాన్ని కలిగిస్తోందని చెబుతూ ఆయనకు పూర్తి మద్దతు ప్రకటించారు. గతంలో తండ్రి--కొడుకుల మధ్య విభేదాలు ఉన్నాయంటూ పలు కథనాలు వెలువడిన సంగతి తెలిసిందే. అయితే చంద్రశేఖర్ తాజా వ్యాఖ్యలు ఆ ప్రచారాలకు పూర్తిగా భిన్నంగా కనిపిస్తున్నాయి. రాజకీయ జీవితంలో విజయ్ తీసుకుంటున్న నిర్ణయాలు, ప్రజా సమస్యలపై ఆయన చూపుతున్న చొరవను తాను దగ్గరగా గమనిస్తున్నానని తెలిపారు. ప్రజల కోసం పని చేయాలనే తపన విజయ్‌లో స్పష్టంగా కనిపిస్తోందని ఆయన అభిప్రాయపడ్డారు. మహిళల గౌరవం, రాజకీయ మర్యాదల వంటి అంశాలపై అసెంబ్లీలో విజయ్ వ్యక్తం చేసిన అభిప్రాయాలు తనను ప్రత్యేకంగా ఆకట్టుకున్నాయని చంద్రశేఖర్ పేర్కొన్నారు. ఒక ప్రజాప్రతినిధిగా విలువలను కాపాడుతూ ముందుకు సాగడం ఎంతో ముఖ్యమని, ఆ విషయంలో విజయ్ స్పష్టమైన వైఖరిని ప్రదర్శిస్తున్నాడని అన్నారు. ప్రజల ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకుని మాట్లాడే నాయకత్వం అవసరమని ఆయన వ్యాఖ్యానించారు. తమ కుటుంబాన్ని లక్ష్యంగా చేసుకుని కొన్ని రాజకీయ వర్గాలు చేస్తున్న ఆరోపణలను కూడా చంద్రశేఖర్ ఖండించారు.



# కేబినెట్ శాఖల మార్పుపై టీపీసీసీ వివరణ

హైదరాబాద్, సెప్టెంబర్ 8, ::

తెలంగాణలో కేబినెట్ విస్తరణ, మంత్రుల శాఖల మార్పుపై రాజకీయ వర్గాల్లో ఊహాగానాలు కొనసాగుతున్న వేళ టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ చేసిన వ్యాఖ్యలు ప్రాధాన్యత సంతరించుకున్నాయి. గాంధీ భవన్‌లో మీడియాతో నిర్వహించిన చిట్‌చాట్‌లో ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం మంత్రులకు కేటాయించిన శాఖలను సమగ్రంగా పునర్‌వ్యవస్థీకరించి కొత్తగా బాధ్యతలు అప్పగించాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు. ఈ మేరకు పార్టీ అధిష్ఠానానికి తన సూచనలను తెలియజేసినట్లు వెల్లడించారు. పీసీసీ అధ్యక్షుడిగా పార్టీ ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకొని తన అభిప్రాయాన్ని హైకమాండ్‌కు తెలియజేశానని మహేశ్ కుమార్ గౌడ్ పేర్కొన్నారు. అయితే శాఖల మార్పులు, మంత్రివర్గ పునర్‌వ్యవస్థీకరణ వంటి అంశాలపై తుది నిర్ణయం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, కాంగ్రెస్ అధిష్ఠానం తీసుకుంటాయని స్పష్టం చేశారు. ప్రభుత్వం, పార్టీ సమన్వయంతో ముందుకు సాగేందుకు అవసరమైన సూచనలు మాత్రమే చేశానని తెలిపారు. ఇటీవల కొండా సురేఖను మంత్రివర్గం నుంచి తప్పించడం, పలు కీలక పదవుల్లో మార్పులు చోటుచేసుకోవడం, ఖాళీగా ఉన్న మంత్రి పదవుల భర్తీపై చర్చలు జరుగుతున్న నేపథ్యంలో కేబినెట్ పునర్‌వ్యవస్థీకరణ అంశం మరింత ప్రాధాన్యతను సంతరించుకుంది. రాష్ట్ర రాజకీయాల్లో కొత్త సమీకరణాలకు అవకాశం ఉందన్న ప్రచారం కూడా కొనసాగుతోంది. ఇక తనను మంత్రివర్గంలోకి తీసుకునే అవకాశాలపై వస్తున్న ప్రచారంపై స్పందించిన మహేశ్ కుమార్ గౌడ్, ఆ విషయాన్ని పూర్తిగా పార్టీ అధిష్ఠానం నిర్ణయానికే వదిలేశానని చెప్పారు.



# వీసా మోసం కేసులో యూట్యూబర్ రమానందనకు చిక్కులు

**హైదరాబాద్/ప్రకాశం జిల్లా, సెప్టెంబర్ 8, ::**

విదేశాల్లో ఉద్యోగాలు, వీసాలు ఇప్పిస్తామంటూ డబ్బులు వసూలు చేసి మోసం చేశారన్న ఆరోపణలతో ప్రముఖ యూట్యూబర్ రమానందన వివాదంలో చిక్కుకున్నారు. ఇబ్రహీంపట్నం పోలీస్ స్టేషన్‌లో నమోదైన వీసా చీటింగ్ కేసులో ఆమె మంగళవారం తన న్యాయవాదులతో కలిసి పోలీసుల ఎదుట విచారణకు హాజరయ్యారు. బాధితుల ఫిర్యాదుల ఆధారంగా కేసు నమోదు చేసిన పోలీసులు ఇప్పటికే దర్యాప్తు ప్రారంభించగా, ఈ వ్యవహారం రాష్ట్రవ్యాప్తంగా చర్చనీయాంశంగా మారింది. బాధితుడు క్రాంతి కుమార్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు రమానందన దంపతులు విదేశాల్లో ఉద్యోగం ఇప్పిస్తామని హామీ ఇచ్చి తన వద్ద నుంచి రూ.13 లక్షలు వసూలు చేశారని ఆరోపణలు వచ్చాయి. అయితే చెప్పినట్లుగా ఉద్యోగం కల్పించకపోవడంతో పాటు డబ్బులు కూడా తిరిగి ఇవ్వలేదని ఫిర్యాదులో పేర్కొన్నారు. దీంతో పోలీసులు కేసు నమోదు చేసి ఆర్థిక లావాదేవీలకు సంబంధించిన వివరాలను సేకరిస్తున్నారు. ఈ కేసు విచారణలో భాగంగా యూకే నుంచి హైదరాబాద్‌కు వచ్చిన వెంటనే పోలీసుల ఎదుట హాజరుకావాలని రమానందనకు నోటీసులు జారీ చేశారు. నోటీసుల మేరకు ఆమె ఇబ్రహీంపట్నం పోలీస్ స్టేషన్‌కు చేరుకుని విచారణలో పాల్గొన్నారు. కేసుకు సంబంధించిన పలు అంశాలపై అధికారులు ప్రశ్నలు అడిగి వివరణ తీసుకున్నట్లు సమాచారం. విచారణ అనంతరం పోలీసులు మరిన్ని ఆధారాలను పరిశీలిస్తున్నట్లు తెలుస్తోంది. ఇదిలా ఉండగా ప్రకాశం జిల్లా అద్దంకి పోలీస్ స్టేషన్‌లో కూడా రమానందనపై మరో కేసు నమోదు కావడం సంచలనంగా మారింది. 'డెస్టినీ కన్సల్టెన్సీ' పేరుతో వీసా రెన్యువల్, సర్టిఫికెట్ ఆఫ్ స్పాన్సర్‌షిప్ ఇప్పిస్తామని నమ్మించి 2023లో భారీ మొత్తంలో డబ్బులు వసూలు చేశారని పలువురు బాధితులు ఆరోపించారు. ఈ మేరకు అద్దంకి పోలీసులు కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు. వరుస కేసులు నమోదవుతుండటంతో మరికొంత మంది బాధితులు కూడా ముందుకు వస్తున్నట్లు సమాచారం. హైదరాబాద్‌తో పాటు ప్రకాశం జిల్లాకు చెందిన బాధితులు తమ ఫిర్యాదులను నమోదు చేసేందుకు ఇబ్రహీంపట్నం పోలీస్ స్టేషన్‌ను ఆశ్రయిస్తున్నారు. బాధితుల వాంగ్మూలాలను నమోదు చేస్తున్న పోలీసులు కేసుల మధ్య ఉన్న సంబంధాలను కూడా పరిశీలిస్తున్నారు. రమానందనపై నమోదైన ఆరోపణల నేపథ్యంలో దర్యాప్తు మరింత విస్తరించే అవకాశాలు కనిపిస్తున్నాయి. విదేశీ ఉద్యోగాలు, వీసాల పేరుతో జరిగిన లావాదేవీలు, కన్సల్టెన్సీ కార్యకలాపాలు, బాధితుల నుంచి వసూలు చేసిన మొత్తాలపై అధికారులు లోతుగా విచారణ చేస్తున్నారు. విచారణలో లభించే ఆధారాల ఆధారంగా తదుపరి చర్యలు తీసుకోనున్నట్లు పోలీసు వర్గాలు వెల్లడించాయి.



# రేవంత్ రెడ్డికి పాడి కౌశిక్ రెడ్డి సవాల్

**కొడంగల్‌లో రాజీనామా చేసి పోటీ చేయాలంటూ ఛాలెంజ్**

**ముఖ్యమంత్రికి బహిరంగ సవాల్ విసిరిన బీఆర్ఎస్ ఎమ్మెల్యే**

**హుజూరాబాద్‌లో తాను కూడా రాజీనామా చేస్తానన్న కౌశిక్ రెడ్డి**

**హైదరాబాద్, సెప్టెంబర్ 8, ::**

ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డికి బీఆర్ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి బహిరంగ సవాల్ విసిరారు. కొడంగల్ శాసనసభ స్థానానికి ముఖ్యమంత్రి రాజీనామా చేసి మళ్లీ ఎన్నికలకు వెళ్లాలని ఆయన డిమాండ్ చేశారు. తాను కూడా హుజూరాబాద్ ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేస్తానని ప్రకటించిన కౌశిక్ రెడ్డి, ఉపఎన్నికల్లో రేవంత్ రెడ్డి డిపాజిట్ సాధిస్తే సభ సాక్షిగా ముక్కు నేలకు రాస్తానంటూ సవాల్ చేశారు. అసెంబ్లీ మీడియా పాయింట్ వద్ద మాట్లాడిన ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. అసెంబ్లీలో ముఖ్యమంత్రి ఉపయోగించిన భాష, పదజాలం ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధంగా ఉందని కౌశిక్ రెడ్డి ఆరోపించారు. శాసనసభ వంటి అత్యున్నత వేదికపై ప్రతిపక్ష సభ్యులను గౌరవించకుండా మాట్లాడటం సరికాదన్నారు. తెలంగాణ సమాజమంతా ముఖ్యమంత్రి వ్యవహారశైలిని గమనిస్తోందని పేర్కొన్నారు. ప్రజాప్రతినిధుల మధ్య పరస్పర గౌరవం ఉండాల్సిన అవసరాన్ని ఆయన గుర్తు చేశారు. సభలో అధికార, ప్రతిపక్షాల మధ్య నెలకొన్న ఉద్రిక్త పరిస్థితులపై కూడా కౌశిక్ రెడ్డి స్పందించారు. కాంగ్రెస్ ఎమ్మెల్యేలు అసెంబ్లీ ఆవరణలోనే ప్రతిపక్ష నేతలను బెదిరించే విధంగా వ్యాఖ్యలు చేశారని ఆరోపించారు. ఇలాంటి సంఘటనలను పట్టించుకోకుండా కేవలం బీఆర్ఎస్ సభ్యులపైనే చర్యల పేరుతో హెచ్చరికలు జారీ చేయడం అన్యాయమని అన్నారు. అధికార పార్టీ నేతల ప్రవర్తనపై కూడా సమానంగా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. పార్టీ ఫిరాయింపుల అంశాన్ని ప్రస్తావిస్తూ కడియం శ్రీహరిపై కౌశిక్ రెడ్డి తీవ్ర విమర్శలు గుప్పించారు. బీఆర్ఎస్ పార్టీ తరఫున ఎన్నో పదవులు అనుభవించిన వ్యక్తి ఇప్పుడు అదే పార్టీపై విమర్శలు చేయడం ఆశ్చర్యకరమన్నారు. పార్టీ బీ-ఫారమ్‌పై గెలిచి తరువాత కాంగ్రెస్‌లో చేరిన కడియం శ్రీహరికి నైతిక విలువల గురించి మాట్లాడే అర్హత లేదని వ్యాఖ్యానించారు. డిప్యూటీ ముఖ్యమంత్రి, ఎమ్మెల్సీ, ఎంపీ వంటి కీలక పదవులు చేపట్టిన సమయంలో కడియం శ్రీహరికి నైతికత గుర్తుకు రాలేదా అని ప్రశ్నించారు. రాజకీయ స్వార్థ ప్రయోజనాల కోసం పార్టీ మారిన నేతలు ఇప్పుడు బీఆర్ఎస్‌కు నీతులు చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. తల్లిలాంటి పార్టీని వీడి వెళ్లిన వారు పార్టీ విధేయత గురించి మాట్లాడటం ప్రజలు గమనిస్తున్నారని పేర్కొన్నారు.

# గ్రీన్‌ఫీల్డ్ విమానాశ్రయ స్థలాల పరిశీలన వేగవంతం

**భద్రాద్రి కొత్తగూడెం, సెప్టెంబర్ 8, ::**

భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో గ్రీన్‌ఫీల్డ్ విమానాశ్రయ ఏర్పాటుకు సంబంధించి ప్రక్రియ కీలక దశకు చేరుకుంది. భారత విమానాశ్రయాల ప్రాధికార సంస్థ (ఏఏఐ) సాంకేతిక బృందం గత రెండు రోజులుగా జిల్లాలో గుర్తించిన ప్రతిపాదిత ప్రాంతాల్లో క్షేత్రస్థాయి పరిశీలనలు నిర్వహిస్తోంది. మంగళవారం ములకలపల్లి మండలం తిమ్మంపేటలో కొనసాగిన పరిశీలనలను జిల్లా కలెక్టర్ అంకిత్ ఐఏఎస్ ఏఏఐ అధికారులతో కలిసి పర్యవేక్షించారు. భవిష్యత్తులో జిల్లాకు వైమానిక అనుసంధానం కల్పించే లక్ష్యంతో ప్రతిపాదించిన విమానాశ్రయ నిర్మాణానికి అనుకూలమైన ప్రాంతాన్ని గుర్తించేందుకు అధికారులు అన్ని కోణాల్లో అధ్యయనం చేపడుతున్నారు. విమానాశ్రయ స్థాపన కోసం సుజాతానగర్ మండలంలోని సీతంపేట, సుజాతానగర్, దుమ్ముగూడెం ప్రాంతాలు, ములకలపల్లి మండలంలోని చాపరాలపల్లి, దమ్మపేట మండలంలోని పాల్వంచ-దమ్మపేట ప్రాంతాలు, చుంచుపల్లి మండలంలోని పెనగడప ప్రాంతాలను ప్రతిపాదిత స్థలాలుగా గుర్తించారు. ఈ ప్రాంతాల్లో భూమి స్వభావం, ఎత్తుపల్లాలు, కొండలు, అటవీ ప్రాంతాలు, నీటి ప్రవాహ మార్గాలు, రహదారులు, రైల్వే మార్గాలు, విద్యుత్ లైన్లు, విమానాల రాకపోకలకు అవసరమైన రన్‌వే, అప్రోచ్ జోన్‌ల అనుకూలత వంటి అంశాలను ఏఏఐ బృందం పరిశీలిస్తోంది. ప్రతి ప్రాంతం భౌగోళికంగా ఎంత మేరకు అనువుగా ఉంటుందనే దానిపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించారు. గతంలో మ్యాప్‌ల ఆధారంగా సుమారు 500 ఎకరాల భూమిని ప్రాథమికంగా గుర్తించిన అధికారులు ఇప్పుడు క్షేత్రస్థాయిలో మరింత లోతైన అధ్యయనం నిర్వహిస్తున్నారు. విమానాశ్రయ నిర్మాణానికి అవసరమైన



రన్‌వే, టెర్మినల్ భవనాలు, కార్గో సదుపాయాలు, భద్రతా మండలాలు, పార్కింగ్ ప్రాంతాలు వంటి మౌలిక సదుపాయాల కోసం అదనపు భూమి అవసరమయ్యే అవకాశాలను కూడా పరిశీలిస్తున్నారు. ముఖ్యంగా విమా నాల ల్యాండింగ్, టేకాఫ్ కార్యకలాపాలకు అవసరమైన అప్రోచ్ ప్రాంతానికి సుమారు 1.5 కిలోమీటర్ల వరకు అదనపు ఖాళీ స్థలం అవసరమయ్యే అంశాన్ని అధికారులు పరిశోధిస్తున్నారు. కొన్ని ప్రతిపాదిత ప్రాంతాలకు సమీపంలో ఉన్న సత్తుపల్లి గూడ్స్ రైల్వే లైన్ విమానాశ్రయ నిర్మాణంపై చూపే ప్రభావాన్ని ఏఏఐ నిపుణులు ప్రత్యేకంగా అధ్యయనం చేస్తున్నారు. రైల్వే విద్యుదీకరణ వ్యవస్థ వల్ల కమ్యూనికేషన్, నావిగేషన్ పరికరాలపై విద్యుదయస్కాంత ప్రభావం ఉంటుందా, విమానాల రాకపోకలకు ఆటంకాలు తలెత్తే అవకాశం ఉందా అనే అంశాలను సాంకేతికంగా పరిశీలిస్తున్నారు. అలాగే రన్‌వే దిశ, అప్రోచ్ మార్గం, భద్రతా ప్రమాణాలు, అవసరమయ్యే రైల్వే అనుమతులు తదితర అంశాలను కూడా సమగ్రంగా విశ్లేషిస్తున్నారు. దుమ్ముగూడెం, తిమ్మంపేటతో పాటు ఇతర ప్రాంతాల్లో రహదారి అనుసంధానం, అటవీ భూముల విస్తీర్ణం, భూమి ఆకృతి, చిన్న కొండలు, వాగులు, కాలువలు, డ్రైనేజీ వ్యవస్థ, మట్టి నాణ్యత వంటి అంశాలపై అధ్యయనం కొనసాగుతోంది. ముఖ్యంగా బ్లాక్ కాటన్ సాయిల్ వంటి భూసాంకేతిక పరిస్థితులు విమానాశ్రయ నిర్మాణానికి ఎంతవరకు అనుకూలంగా ఉంటాయనే అంశాన్ని అధికారులు పరిశీలిస్తున్నారు. అవసరమైతే రన్‌వే దిశలో మార్పులు చేయాల్సిన పరిస్థితులు ఉన్నాయా అనే అంశాన్ని కూడా అధ్యయనంలో భాగంగా పరిగణిస్తున్నారు. అటవీ అనుమతులు, పర్యావరణ అనుమతులు, చెట్ల తొలగింపు అవసరం, గాలి వేగం-దిశ, వర్షపాతం, వాతావరణ పరిస్థితులు వంటి అంశాలన్నింటినీ సమగ్రంగా పరిగణనలోకి తీసుకొని ఏఏఐ బృందం తుది నివేదికను సిద్ధం చేయనుంది.

# వీసా మోసం కేసులో యూట్యూబర్ రమానందనకు చిక్కులు

**హైదరాబాద్, సెప్టెంబర్ 8, :**

సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచిన బతుకమ్మ పండుగను ప్రపంచ వ్యాప్తంగా మరింత విస్తృతంగా ప్రచారం చేయడంతో పాటు యువతలోని సృజనాత్మక ప్రతిభను ప్రోత్సహించేందుకు నిర్వహిస్తున్న 'బతుకమ్మ యంగ్ ఫిలిం మేకర్స్ ఛాలెంజ్--2026' పోస్టర్‌ను రాష్ట్ర మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి మంగళవారం ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ శంకర్ నాయక్, ఎఫ్‌డీసీ ఎండీ జి. ముకుంద రెడ్డి, రాష్ట్ర ప్రభుత్వ క్రియేటివ్ డైరెక్టర్ రాజ్ కొండా, మాజీ సెట్విన్ చైర్మన్ గిరిధర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ, బతుకమ్మ పండుగ విశిష్టతను సృజనాత్మకంగా ప్రపంచానికి పరిచయం చేయడానికి ఈ ఛాలెంజ్ ఒక మంచి అవకాశమని అన్నారు. యువ ఫిలిం మేకర్స్ తమ ఆలోచనలు, ప్రతిభను ప్రదర్శించేందుకు ఇది సమర్థవంతమైన వేదికగా ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. షార్ట్ ఫిలింలు, పాటలు, వీడియోల రూపంలో యువత తమ సృజనాత్మకతను ప్రదర్శించవచ్చని మంత్రి తెలిపారు. బతుకమ్మ పండుగకు సంబంధించిన సాంస్కృతిక విశిష్టత, తెలంగాణ జానపద సంప్రదాయాలు, కళారూపాలను కొత్త తరానికి చేరవేయడంలో ఈ కార్యక్రమం కీలక పాత్ర పోషిస్తుందని చెప్పారు. అలాగే రాష్ట్ర ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను సృజనాత్మకంగా ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు కూడా ఈ ఛాలెంజ్ ఉపయోగపడుతుందని మంత్రి అభిప్రాయపడ్డారు. యువత తమ ప్రతిభను ప్రదర్శించడమే కాకుండా తెలంగాణ సంస్కృతిని విస్తృతంగా ప్రచారం చేసే అవకాశం కూడా పొందుతారని పేర్కొన్నారు. విద్యార్థులు, యువ ఫిలిం మేకర్స్, ఔత్సాహిక కళాకారులు పెద్ద సంఖ్యలో పాల్గొని ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని మంత్రి పిలుపునిచ్చారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ప్రతిభావంతులైన యువత ఈ అవకాశాన్ని వినియో గించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ప్రముఖులు బతుకమ్మ పండుగను ఆధారంగా చేసుకుని రూపొందించే సృజనాత్మక కంటెంట్ తెలంగాణ సాంస్కృతిక వైభవాన్ని మరింతగా చాటుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. బతుకమ్మ యంగ్ ఫిలిం మేకర్స్ ఛాలెంజ్--2026 యువతలో సృజనాత్మకతను ప్రోత్సహించే ప్రత్యేక కార్యక్రమంగా నిలవనుందని పేర్కొన్నారు.



# బీఆర్ఎస్ ఎమ్మెల్సీ తాతా మధు అరెస్ట్

**హైదరాబాద్, సెప్టెంబర్ 8, :**

తెలంగాణ అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్‌పై అనుచిత వ్యాఖ్యలు చేశారన్న ఆరోపణల నేపథ్యంలో బీఆర్ఎస్ ఎమ్మెల్సీ తాతా వెంకట కిష్టయ్య అలియాస్ తాతా మధును పోలీసులు మంగళవారం అరెస్ట్ చేశారు. హైదరాబాద్‌లోని నూతన ఎమ్మెల్యే క్వార్టర్స్‌లో భారీ పోలీసు బందోబస్తు మధ్య ఆయనను అదుపులోకి తీసుకున్నారు. ఈ సందర్భంగా అక్కడ ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. తాతా మధుతో పాటు బీఆర్ఎస్ ఎమ్మెల్సీ నవీన్ రెడ్డిని కూడా పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. సోమవారం అసెంబ్లీ గేట్ల వద్ద బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులు, పోలీసుల మధ్య జరిగిన తోపులాట సందర్భంగా స్పీకర్‌ను ఉద్దేశించి తాతా మధు అనుచిత పదజాలం ఉపయోగించారని ఆరోపణలు వచ్చాయి. ఈ ఘటనపై ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి తీవ్రంగా స్పందిస్తూ, స్పీకర్‌పై వాడిన భాష శాసనసభ గౌరవానికి, తెలంగాణ ఆత్మగౌరవానికి అవమానకరమని పేర్కొన్నారు. తాతా మధును శాసనమండలి సభ్యత్వం నుంచి బర్తరఫ్ చేయాలని మండలి ఛైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డిని కోరారు.



తెలంగాణ పోలీస్ శాఖ విడుదల చేసిన అరెస్ట్ ఇంటిమేషన్ ప్రకారం, క్రైమ్ నంబర్ 364/2026లో తాతా మధుపై భారతీయ న్యాయ సంహిత (బీఎన్ఎస్) సెక్షన్ 352తో పాటు 3(5) నిబంధనల కింద కేసు నమోదు చేశారు. అలాగే ఎస్సీ/ఎస్టీ (అట్రాసిటీస్ నిరోధక) చట్టంలోని సెక్షన్ 3(1)(ర్), 3(2)(ఝు), 3(2)(జఅఅ) కింద కూడా కేసులు నమోదు చేసినట్లు వెల్లడించారు. అరెస్ట్ అనంతరం తాతా మధును హైదరాబాద్ నాంపల్లిలోని ప్రథమ అదనపు చీఫ్ జ్యుడీషియల్ మేజిస్ట్రేట్ కోర్టులో హాజరుపరిచినట్లు పోలీసులు తెలిపారు. అనంతరం ఆయనను జ్యుడీషియల్ కస్టడీకి తరలించే ప్రక్రియ చేపట్టినట్లు అరెస్ట్ ఇంటిమేషన్‌లో పేర్కొన్నారు. ఈ పరిణామం రాష్ట్ర రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. మరోవైపు తనపై వచ్చిన ఆరోపణలను తాతా మధు ఖండించారు. తాను స్పీకర్‌ను ఉద్దేశించి ఎలాంటి అవమానకర వ్యాఖ్యలు చేయలేదని, తన మాటలను అధికార కాంగ్రెస్ పార్టీ వక్రీకరిస్తోందని ఆరోపించారు. ఒకవేళ తన వ్యాఖ్యలు స్పీకర్‌ను కించపరిచినట్లు భావిస్తే వాటిపై విచారం వ్యక్తం చేస్తూ వెనక్కి తీసుకుంటున్నానని తెలిపారు.

# గాయపడిన మహిళా పోలీసులను పరామర్శించిన మంత్రి సీతక్క

**అసెంబ్లీ ఘటనలో గాయపడిన మహిళా సిబ్బందితో భేటీ**

**ఘటన వివరాలు అడిగి తెలుసుకున్న మంత్రి**

**విధి నిర్వహణలో ధైర్యంగా వ్యవహరించారని అభినందన**

**మహిళా పోలీసులకు అండగా ఉంటామని భరోసా**

**హైదరాబాద్, సెప్టెంబర్ 8, :**

తెలంగాణ అసెంబ్లీ పరిణామాల నేపథ్యంలో గాయపడిన మహిళా పోలీసు సిబ్బందిని రాష్ట్ర మంత్రి సీతక్క మంగళవారం పరామర్శించారు. ఇటీవల జరిగిన ఘటనలో గాయపడిన మహిళా పోలీసుల ఆరోగ్య పరిస్థితిని తెలుసుకుని వారికి ధైర్యం చెప్పారు. విధి నిర్వహణలో ఎదురైన పరిస్థితులపై ఆమె వారితో మాట్లాడారు. ఈ సందర్భంగా మహిళా పోలీసు అధికారులు ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలను మంత్రికి వివరించారు. విధి నిర్వహణ సమయంలో చోటుచేసుకున్న పరిణామాలు, గాయపడిన పరిస్థితులను వివరంగా తెలియజేశారు. మంత్రి వారి వాంగ్మూలాలను



శ్రద్ధగా విని సంఘటనపై ఆరా తీశారు. గాయపడిన సిబ్బంది ఆరోగ్య పరిస్థితి గురించి వైద్యులను అడిగి తెలుసుకున్న సీతక్క, వారికి మెరుగైన వైద్యం అందించాలని సూచించారు. విధి నిర్వహణలో భాగంగా ఎదురయ్యే సవాళ్లను ధైర్యంగా ఎదుర్కొంటున్న పోలీసు సిబ్బంది సేవలు అభినందనీయమని పేర్కొన్నారు. మహిళా పోలీసుల భద్రత, సంక్షేమం విషయంలో ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటుందని మంత్రి తెలిపారు. విధుల్లో ఉన్న సమయంలో గాయపడిన సిబ్బందికి అవసరమైన సహాయం అందించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని చెప్పారు. పోలీసు శాఖ ప్రజాస్వామ్య వ్యవస్థకు కీలకమైన సంస్థ అని పేర్కొన్నారు. విధి నిర్వహణలో నిబద్ధతతో పనిచేసిన మహిళా పోలీసులను మంత్రి అభినందించారు. ఎలాంటి ఒత్తిళ్లకు లొంగకుండా తమ బాధ్యతలను నిర్వర్తించినందుకు వారిని ప్రశంసించారు. భవిష్యత్తులో కూడా అదే సేవా భావంతో పనిచేయాలని ఆకాంక్షించారు. ఈ పరామర్శ కార్యక్రమంలో పోలీసు శాఖకు చెందిన అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు. గాయపడిన మహిళా పోలీసులకు మంత్రి సీతక్క త్వరగా కోలుకోవాలని ఆకాంక్షిస్తూ ప్రభుత్వం తరఫున పూర్తి సహకారం అందిస్తామని భరోసా ఇచ్చారు.



# 53వ అంతస్తులో హీరోయిన్ ఇల్లు..

**ముంబై, సెప్టెంబరు 8 ::**

సినీ తారల వ్యక్తిగత జీవితం, జీవనశైలి, ఫిట్‌నెస్, ఫ్యాషన్‌తో పాటు వారు నివసించే ఇళ్ల గురించి తెలుసుకునేందుకు అభిమానులు ఎప్పుడూ ఆసక్తి చూపిస్తుంటారు. ముఖ్యంగా ప్రముఖ నటీనటుల విలాసవంతమైన ఇళ్లకు సంబంధించిన చిత్రాలు, విశేషాలు సామాజిక మాధ్యమాల్లో తరచూ వైరల్ అవుతుంటాయి. తాజాగా బాలీవుడ్ ప్రముఖ నటి మాధురీ దీక్షిత్, ఆమె భర్త డాక్టర్ శ్రీరామ్ నేనే నివసించే విలాసవంతమైన ఇంటికి సంబంధించిన విశేషాలు నెట్టింట చర్చనీయాంశంగా మారాయి. బాలీవుడ్‌లో దశాబ్దాల పాటు అగ్ర కథానాయికగా కొనసాగిన మాధురీ దీక్షిత్ తన నటన, నృత్యంతో కోట్లాది మంది అభిమానులను సంపాదించుకున్నారు. కొంతకాలం సినిమాలకు దూరంగా ఉన్నప్పటికీ.. ప్రస్తుతం సినిమాలు, వివిధ కార్యక్రమాలతో మళ్లీ బిజీగా మారారు. ఈ నేపథ్యంలో ఆమె వ్యక్తిగత జీవనశైలికి సంబంధించిన అంశాలు కూడా అభిమానుల దృష్టిని ఆకర్షిస్తున్నాయి. ముంబైలోని ఓ బహుళ అంతస్తుల భవనంలోని 53వ అంతస్తులో మాధురీ దీక్షిత్, డాక్టర్ శ్రీరామ్ నేనే కుటుంబం నివసిస్తోంది. సుమారు 5,500 చదరపు అడుగుల విస్తీర్ణంలో ఉన్న ఈ ఇంటి నుంచి అరేబియా సముద్రంతో పాటు ముంబై నగర అందాలను విశాలంగా వీక్షించవచ్చు. ఇంటి నిర్మాణం, అలంకరణలో ఆధునికతతో పాటు ప్రశాంతమైన వాతావరణానికి ప్రాధాన్యత ఇచ్చారు. ప్రముఖ వాస్తుశిల్పి అపూర్వ ష్రాఫ్ ఈ ఇంటి రూపకల్పనలో కీలకంగా వ్యవహరించారు. కుటుంబ సభ్యులకు సౌకర్యవంతంగా ఉండేలా, ఆధునికంగా కనిపిస్తూనే సరళమైన రూపాన్ని కలిగి ఉండే విధంగా ఇంటి అంతర్గత అలంకరణను రూపొందించారు.

# తెలుగు సినిమాలపై కార్తీ ప్రశంసలు

**హైదరాబాద్, సెప్టెంబరు 8 ::**

హీరో కార్తీ తెలుగు సినిమాలపై, తెలుగు ప్రేక్షకులపై తనకున్న ప్రత్యేక అభిమానాన్ని మరోసారి చాటుకున్నారు. హైదరాబాద్‌లో నిర్వహించిన 'సర్దార్ 2' ప్రచార కార్యక్రమంలో పాల్గొన్న ఆయన.. తమిళనాట తెలుగు సినిమాలకు ఆదరణ లేదనే ప్రచారాన్ని ఖండించారు. మంచి కథ, మంచి కంటెంట్ ఉన్న ఏ భాష చిత్రాన్నైనా ప్రేక్షకులు ఆదరిస్తారని స్పష్టం చేశారు. తెలుగు సినిమాలకు తమిళ ప్రేక్షకుల్లోనూ మంచి ఆదరణ ఉందని కార్తీ తెలిపారు. 'బాహుబలి' నుంచి ఇటీవల వచ్చిన 'ఆర్ఆర్ఆర్', 'కాంతార' వర కు భాషతో సంబంధం లేకుండా ప్రేక్షకులు మంచి సినిమాలను ఆదరిస్తున్నారని చెప్పారు. సినిమా బాగుంటే అది ఏ భాషకు చెందినదైనా ప్రేక్షకులు ఆదరిస్తారని, కంటెంట్‌కే ప్రాధాన్యత ఉంటుందని పేర్కొన్నారు. దర్శకుడు పి.ఎస్. మిత్రన్ తెరకెక్కించిన 'సర్దార్ 2' సెప్టెంబరు 10న ప్రపంచవ్యాప్తంగా విడుదల కానున్న నేపథ్యంలో కార్తీ ఈ వ్యాఖ్యలు చేశారు. ఇప్పటికే 'ఖైదీ', 'సర్దార్' వంటి చిత్రాలతో తెలుగు రాష్ట్రాల్లో కార్తీకి మంచి మార్కెట్ ఏర్పడింది.



# నిర్మాతగా ఉదయభాను కొత్త ప్రయాణం

**హైదరాబాద్, సెప్టెంబరు 8 ::**

బుల్లితెరపై తనదైన శైలిలో వ్యాఖ్యాతగా వ్యవహరిస్తూ సుదీర్ఘకాలంగా ప్రేక్షకులను అలరిస్తున్న ప్రముఖ యాంకర్ ఉదయభాను ఇప్పుడు కొత్త అవతారంలో కనిపించనున్నారు. ఇప్పటివరకు యాంకర్‌గా, టెలివిజన్ కార్యక్రమాల ద్వారా ప్రేక్షకులకు దగ్గరైన ఆమె.. తాజాగా సినీ నిర్మాణ రంగంలోకి అడుగుపెట్టారు. ఇందుకోసం 'ఉదయభాను ప్రొడక్షన్స్' పేరుతో సొంత నిర్మాణ సంస్థను ప్రారంభించారు. తన నిర్మాణ సంస్థ తొలి ప్రయత్నంగా 'పంచనామా' అనే ఉత్కంఠభరితమైన నేర పరిశోధన వెబ్ సిరీస్‌ను తెరకెక్కిస్తున్నారు. ఈ సిరీస్ ద్వారా నిర్మాతగా ఉదయభాను తన అదృష్టాన్ని పరీక్షించుకోనున్నారు. వ్యాఖ్యాతగా ఇప్పటికే తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న ఆమె.. నిర్మాణ రంగంలోకి రావడంతో చిత్ర, బుల్లితెర వర్గాల్లో ఆసక్తి నెలకొంది. 'పంచనామా' వెబ్ సిరీస్‌కు మోహన్ శ్రీవాత్స దర్శకత్వం వహిస్తున్నారు. కథలోని ఉత్కంఠభరితమైన అంశాలతో పాటు నేర పరిశోధన నేపథ్యంలో సాగే కథనంతో ఈ సిరీస్‌ను రూపొందించినట్లు తెలుస్తోంది. ఇప్పటికే విడుదలైన ప్రచార చిత్రానికి ప్రేక్షకుల నుంచి మంచి స్పందన లభించింది. సిరీస్‌లోని పాత్రలు, కథాంశం, ఉత్కంఠభరితమైన సన్నివేశాలు ప్రేక్షకుల్లో ఆసక్తిని పెంచుతున్నాయి. ఈ వెబ్ సిరీస్‌లో 'ప్రేమిస్తే' సినిమాతో తెలుగు ప్రేక్షకులకు పరిచయమైన నటుడు భరత్ శ్రీనివాసన్ కథానాయకుడిగా నటిస్తున్నారు. సుదీర్ఘ విరామం తర్వాత భరత్ మరో ఆసక్తికరమైన కథతో ప్రేక్షకుల ముందుకు వస్తుండటంతో ఈ సిరీస్‌పై అంచనాలు పెరిగాయి. తన పాత్రకు ప్రాధాన్యం ఉండటంతో పాటు కథ మొత్తం ఉత్కంఠభరితంగా సాగనున్నట్లు చిత్రబృందం వెల్లడించింది.

ఇప్పటికే విడుదలైన 'పంచనామా' ప్రచార చిత్రం సిరీస్ కథాంశంపై ఆసక్తిని పెంచింది. నేరం, దాని వెనుక దాగి ఉన్న నిజాలు, వాటిని ఛేదించే క్రమంలో ఎదురయ్యే పరిణామాల చుట్టూ కథ సాగనున్నట్లు తెలుస్తోంది. ప్రతి మలుపులోనూ ఉత్కంఠను కొనసాగించేలా దర్శకుడు మోహన్ శ్రీవాత్స కథనాన్ని రూపొందించినట్లు సమాచారం. 'ఉదయభాను ప్రొడక్షన్స్' తొలి నిర్మాణంగా వస్తున్న ఈ సిరీస్ నిర్మాతగా ఉదయభానుకు కీలకమైన ప్రాజెక్టుగా మారింది. ఇన్నాళ్లు తెరపై వ్యాఖ్యాతగా ప్రేక్షకులను ఆకట్టుకున్న ఆమె.. ఇప్పుడు తెర వెనుక నిర్మాణ బాధ్యతలు చేపట్టి తన సృజనాత్మకతను చూపించేందుకు సిద్ధమయ్యారు. తొలి ప్రయత్నంలోనే విభిన్నమైన కథను ఎంచుకోవడం ద్వారా నిర్మాణ రంగంలోనూ తనదైన ముద్ర వేయాలనే లక్ష్యంతో ముందుకు సాగుతున్నట్లు తెలుస్తోంది.



# 'టాక్సిక్' ఓటీటీ రైట్స్‌కు షాక్?




**హైదరాబాద్, సెప్టెంబరు 8 ::**

కన్నడ రాకింగ్ స్టార్ యష్ హీరోగా తెరకెక్కిన పాన్ ఇండియా చిత్రం 'టాక్సిక్: ఎ ఫెయిరీ టేల్ ఫర్ గ్రోన్-అప్స్' విడుదలకు ముందు భారీ అంచనాలను సొంతం చేసుకుం ది. 'కేజీఎఫ్ 2' వంటి భారీ విజయం తర్వాత యష్ నటించిన చిత్రం కావడంతో దేశవ్యాప్తంగా ఈ సినిమాపై భారీ ఆసక్తి నెలకొంది. అయితే థియేటర్లలో మాత్రం చిత్రం ఆశించిన స్థాయిలో వసూళ్లు సాధించ లేక పోయిందనే చర్చ జరిగింది. ఇప్పు డు ఆ ప్రభావం సినిమా డిజిటల్ హక్కులపై పడినట్లు సినీ, వాణిజ్య వర్గాల్లో ప్రచారం జరుగుతోంది. విడుదలకు ముం దు 'టాక్సిక్' పై ఉన్న క్రేజ్‌ను దృష్టిలో పెట్టు కుని ఓ ప్రముఖ ఓటీటీ సంస్థ డిజిటల్ ప్రసార హక్కుల కోసం సుమారు రూ.150 కోట్ల వరకు ఆఫర్ చేసినట్లు అప్పట్లో వార్తలు వచ్చాయి. యష్ క్రేజ్‌తో పాటు సిని మాపై ఉన్న భారీ అంచనాలు, ప్రచార చిత్రాల్లో కనిపించిన అంశాలు ఈ భారీ ఆఫర్‌కు కారణమని ప్రచారం జరిగింది. అయితే ఆ సమయంలో ఆ ఆఫర్‌ను చిత్ర బృందం తిరస్కరించి నట్లు సమాచారం. థియే టర్లలో సినిమా ఘన విజయం సాధిస్తే డిజిటల్ హక్కుల విలువ మరింత పెరిగి రూ.200 కోట్ల వరకు చేరుకో వచ్చని మేకర్స్ అంచనా వేసినట్లు సినీ వర్గాల్లో చర్చ జరిగింది. కానీ బాక్సాఫీస్ ఫలి తం అంచనాలకు అను గుణంగా లేక పోవ డంతో ఇప్పుడు పరిస్థితులు మారిపో యినట్లు తెలుస్తోంది.



# మణిరత్నంతో సాయి పల్లవి జోడీ

**హైదరాబాద్, సెప్టెంబరు 8 ::**

లేడీ పవర్‌స్టార్ సాయి పల్లవికి దక్షిణాది చిత్ర పరిశ్రమలో ఉన్న క్రేజ్ గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు. విభిన్నమైన కథలు, సహజమైన నటనతో తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న ఆమె.. ప్రస్తుతం దక్షిణాదితో పాటు బాలీవుడ్‌లోనూ వరుస అవకాశాలను అందుకుంటున్నారు. ఇప్పటికే బాలీవుడ్‌లో అడుగుపెట్టిన సాయి పల్లవి.. ప్రస్తుతం నితీశ్ తివారీ దర్శకత్వంలో తెరకెక్కుతున్న ప్రతిష్ఠాత్మక 'రామాయణం' చిత్రంలో నటిస్తున్నారు. మరోవైపు దక్షిణాదిలోనూ ఆమెకు వరుస అవకాశాలు వస్తున్నాయి. తాజాగా సాయి పల్లవి మరో క్రేజీ ప్రాజెక్ట్‌ను ప్రకటించారు. లెజెండరీ దర్శకుడు మణిరత్నం దర్శకత్వంలో మక్కల్ సెల్వన్ విజయ్ సేతుపతి, సాయి పల్లవి జంటగా ఓ చిత్రం తెరకెక్కుతోంది. ఎలాంటి హడావుడి లేకుండా ఈ సినిమా షూటింగ్ ఇప్పటికే ప్రారంభమై వేగంగా కొనసాగుతోంది.కొంతకాలంగా ఈ సినిమాకు సంబంధించిన వార్తలు సినీ వర్గాల్లో చక్కర్లు కొడుతున్నాయి. అయితే తాజాగా చిత్రబృందం అధికారికంగా టైటిల్‌ను ప్రకటించింది. ఈ చిత్రానికి 'ఇంజి వెల్లం' అనే ఆసక్తికరమైన పేరును ఖరారు చేశారు. టైటిల్ ప్రకటన సందర్భంగా విడుదల చేసిన పోస్టర్ ప్రేక్షకుల దృష్టిని ఆకర్షిస్తోంది. తాజాగా విడుదలైన పోస్టర్‌లో విజయ్ సేతుపతి, సాయి పల్లవి వర్షంలో తడుస్తూ ఒకరికొకరు దగ్గరగా కనిపించారు. సాయి పల్లవి చిరునవ్వులు చిందిస్తుండగా.. విజయ్ సేతుపతి క్లీన్‌షేవ్ లుక్‌లో కనిపించడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. పోస్టర్‌ను చూస్తుంటే మణిరత్నం శైలిలో ప్రేమ, భావోద్వేగాలకు ప్రాధాన్యమిచ్చే కథగా ఈ చిత్రం తెరకెక్కుతున్నట్లు తెలుస్తోంది.

"This newspaper/periodical is published by KALIDINDI SUMALATHA from 1-7-750/1-3, F 103, SRUTHI SADAN APTS ST PIOUS SCHOOL ROAD, RAMNAGAR, HYDERABAD, TELANGANA - 500020. on behalf of **RS USAR PUBLICATIONS**, edited by RAGHURAMA RAJU KALIDINDI and printed by **KALIDINDI SUMALATHA** at **KING DIGITAL OFFSET PRINTERS**, 1-7-750/1-3, F 103, SRUTHI SADAN APTS ST PIOUS SCHOOL ROAD, RAMNAGAR, HYDERABAD, TELANGANA – 500020. **PRGI NO: TGTEL/26/A2948,** Email: rsusarp@myyahoo.com, 9849350555, 9515121467